ఆంధ్రజ్యోతి
గరిష్ఠం 30.5
కనిష్ఠం 24.0
ANDHRAJYOTHY




ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.0450)	587.00 (305.9222)	36,960	36,960
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	644.50 (4.33)	5,015.38	5,015.38
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	172.176 (41.4867)	33,755	57,858

ప్రాజెక్టుల నీటిమట్టం

చికెన్ ధరలు | లైవ్ : రూ.150 | డ్రెస్ : రూ.240 | స్కిన్‌లెస్ : రూ.260

ఉపాధి పనులకు దూరం

మునిసిపాలిటీలో విలీనంతో శివారు ప్రాంత ప్రజల ఇక్కట్లు



మునిసిపాలిటీల్లో పలు గ్రామపంచాయతీలు విలీనం కావడంతో ఆయా ప్రాంత ప్రజలకు ఉపాధి హామీ పథకం వర్తించకుండాపోయింది. 2018, ఆగస్టు 2, పలు శివారు గ్రామాలను ప్రభుత్వం మునిసిపాలిటీల్లో విలీనం చేసింది. దీంతో శివారు గ్రామాలు పట్టణాల పరిధిలోకి రావడంతో కేంద్ర ప్రభుత్వ నిబంధనల మేరకు ఆయా గ్రామాల ప్రజలకు ఉపాధి హామీ వర్తించక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.
- (ఆంధ్రజ్యోతి,సూర్యాపేటటౌన్)

జిల్లాలో సూర్యాపేట, కోదాడ, హుజూర్‌నగర్, తిరుమలగిరి, నేరేడుచర్ల మునిసిపాలిటీలు ఉన్నాయి. నాలుగు మునిసిపాలిటీల్లో శివారు గ్రామపంచాయతీలను ప్రభుత్వం విలీనం చేసింది. గతంలో విలీన గ్రామాల కూలీలు ఉపాధి పనులకు వెళ్లేవారు. ప్రస్తుతం ఈ పనులకు దూరమయ్యామని కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సూర్యాపేట మునిసిపాలిటీ జనాభా 1.15 లక్షలు కాగా, శివారు పంచాయతీలను విలీనం చేయడంతో జనాభా మరో 30వేలు పెరిగింది. ప్రస్తుతం 1.80లక్షల వరకు జనాభా ఉంది. మునిసిపాలిటీలో సూర్యాపేట మం డలం పిల్లలమర్రి, గాంధీనగర్, రాయినిగూడెం, కుసుమవారిగూడెం, కుప్పిరెడ్డిగూడెం, దాసాయిగూడెం, చివ్వెంల మండలం కుడకుడ, బీబిగూడెం, దురాజ్‌పల్లి గ్రామాలు విలీనమయ్యాయి. కోదాడలో కోమరబండ, తమ్మర విలీనమయ్యాయి. తిరుమలగిరి మునిసిపాలిటీలో మాలిపురం, అనంతారం, నందాపురం, ఈదులపర్రైతండా, నెల్లిబండతండాలను కలిపారు. నేరేడుచర్ల మునిసిపాలిటీలో రాంపురం, దిర్శించర్ల గ్రామ పంచాయతీల పరిధిలోని నర్సాయిగూడెం, నేతాజీనగర్, చిల్లేపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని రామగిరి, గాంధీనగర్ గ్రామాలను కలిపారు. సూర్యాపేటలో విలీన గ్రామాలు 13 ఉండగా, వీటిలో 16,400 మందికి 13,550 జాబ్‌కార్డులు ఉన్నాయి. తిరుమలగిరిలో విలీన గ్రామాల్లో 2,872 మంది ఉండగా, 2,760 జాబ్‌కార్డులు ఉన్నాయి. కోదాడలో రెండు విలీన గ్రామాలు ఉండగా, 29,601 జనాభా ఉంది. వీరిలో 3,200 జాబ్‌కార్డులు ఉన్నాయి. నేరేడుచర్లలో ఐదు విలీన గ్రామాలు ఉండగా, 2,530 జనాభా ఉంది. వీరిలో 659 మందికి జాబ్‌కార్డులు ఉన్నాయి.

జాబ్‌కార్డులు 20,160

జిల్లాలోని నాలుగు మునిసిపాలిటీల్లో 27 గ్రామాలను విలీనం చేశారు. ఆయా గ్రామాల్లో 51,157 జనాభా ఉండగా, జాబ్‌కార్డులు 20,160 వరకు ఉన్నాయి. ప్రస్తుతం వీరికి ఉపాధిహామీ పథకం అమలు కావడంలేదు. మునిసిపాలిటీల్లో గ్రామాలను విలీనం చేయడంతో ఇంటి పన్నులు పెరిగాయి. అయితే గతం మాదిరిగానే ఉపాధి హామీ పథకాన్ని విలీన గ్రామాల్లో అమలు చేయాలని కూలీలు కోరుతున్నారు.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం



విలీన గ్రామాల్లో ఉపాధి హామీ పథకం అమలుపై ఉన్నతాధిదికారుల దృష్టికి తీసుకెళ్తాం. వారి నుంచి వచ్చే సూచనలు అమలు చేస్తాం. విలీన గ్రామాల అభివృద్ధికి నిరంతరం పాటుపడుతున్నాం. ప్రజలకు ఏవైనా సమస్యలు ఉంటే అధికారుల దృష్టికి తీసుకురావాలి.
- సీహెచ్.హన్మంతరెడ్డి, సూర్యాపేట మునిసిపల్ కమిషనర్

మద్యం దుకాణాల కేటాయింపు పూర్తి



జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన నూతన మద్యం దుకాణాల కేటాయింపుల కార్యక్రమం ప్రశాంతంగా ముగిసింది. కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్ ఉదయం 11 నుంచి సాయంత్రం 4గంటల వరకు కలెక్టరేట్‌లో ఈ కార్యక్రమాన్ని స్వయంగా పరిశీలించారు. 93 దుకాణాలకు కలెక్టర్‌లాటరీ తీసి కేటాయింపుల కార్యక్రమాన్ని నిర్వహించారు.
- (ఆంధ్రజ్యోతి,సూర్యాపేటక్రైం):

- చివరి వరకు ఉత్కంఠగా సాగిన ప్రక్రియ
- జిల్లాలో 93 మద్యం దుకాణాలకు 2,771 దరఖాస్తులు
- పెద్దగా ప్రభావం చూపని మహిళల అదృష్టం
- భార్యాభర్తలను వరించిన లక్కు

మద్యం దుకాణాల కేటాయింపు కార్యక్రమానికి వ్యాపారులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. దీంతో ఎలాంటి ఇబ్బందులు ఏర్పడకుండా ఎస్పీ కొత్తపల్లి నర్సింహ ఆధ్వర్యంలో డీఎస్పీ వి.ప్రసన్నకుమార్ పర్యవేక్షణలో సూర్యాపేటరూరల్, తుంగతుర్తి సీఐలు రాజశేఖర్, నర్సింహారావు, సిబ్బంది బందోబస్తు నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ లక్ష్మానాయక్, ఎక్సైజ్ సీఐలు మల్లయ్య, నాగార్జునరెడ్డి, శంకర్, రజిత, స్టీఫెన్‌సన్‌తో పాటు పలువురు ఎస్‌ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

సాయంత్రం వరకు సాగిన కార్యక్రమం

జిల్లాలో నూతన మద్యం దుకాణాల కేటాయింపు కార్యక్రమం ఉదయం 11 నుంచి సాయంత్రం 4గంటల వరకు సాగింది. దుకాణాల కేటాయింపులో ఎలాంటి అవకతవకలు జరగకుండా ఉండేందుకు ఎక్సైజ్‌శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక చర్యలు చేపట్టారు. దుకాణాల ప్రభుత్వం గెజిట్ నెంబర్ల వారీగా దరఖాస్తుదారులను పిలిచి లాటరీ నిర్వహించారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు సూర్యాపేట, తుంగతుర్తి ఎక్సైజ్ స్టేషన్ల పరిధిలో ఉన్న దుకాణాలకు, మధ్యాహం నుంచి సాయంత్రం వరకు కోదాడ, హుజూర్‌నగర్ ఎక్సైజ్ స్టేషన్ల పరిధిలోని దుకాణాలకు లాటరీ నిర్వహించారు. లక్కీ డ్రా ప్రక్రియను అధికారులు వీడియో రికార్డింగ్ చేయించారు. నూతనంగా దుకాణాలు పొందిన వ్యాపారులు ఈ ఏడాది డిసెంబరు 1వ తేదీ నుంచి 2027 నవంబరు చివరి వరకు దుకాణాలు నిర్వహించాల్సి ఉంటుంది. జిల్లాలో మొత్తం 93 దుకాణాల్లో 27 దుకాణాలు గౌడ కులస్థులకు, 10 దుకాణాలు ఎస్సీలకు, మూడు ఎస్టీలకు రిజర్వేషన్ చేశారు. మిగిలిన 53 దుకాణాలు జనరల్‌కు కేటాయించారు.

కొందరికే లక్కు...

మద్యం దుకాణాల...

మిగతా 8వ పేజీలో..

ప్రభావం చూపని మహిళల అదృష్టం..

మద్యం దుకాణాల కేటాయింపులు లాటరీ పద్ధతిలో జరుగుతుండడంతో జిల్లాలో కొంతమంది మద్యం వ్యాపారులు వారి భార్య, కుమార్తెలు, కోడళ్ల పేరుతో దరఖాస్తు చేశారు. మహిళలపై అదృష్టం కలిసి వస్తుందని భావించారు. అయితే జిల్లాలో మొత్తం 93 దుకాణాలకు 500 మంది మహిళలకు పైగా దరఖాస్తులు చేయగా, కేవలం పదుల సంఖ్యలో మాత్రమే మహిళల పేరుతో లాటరీలో దుకాణాలు దక్కాయి.

తుఫాన్‌తో రైతులు ఇబ్బందులు పడకుండా చూడాలి

నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వర్‌రావు, పాల్గొన్న కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్, అధికారులు

సూర్యాపేట(కలెక్టరేట్), అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్‌తో రైతులు ఇబ్బంది పడకుండా చూడాలని నీటి పారుదల శాఖ మంత్రి నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. సోమవారంరాత్రి హైదరాబాద్ నుంచి వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, సీఎస్ రామకృష్ణారావుతో కలిసి కలెక్టర్, ఇతర అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రి మాట్లాడారు. తుఫాన్ ప్రభావంతో పత్తి, వరి ధాన్యం, మొక్కజొన్న పంటలు దెబ్బతినకుండా చూడాలని ఆదేశించారు. జిల్లాలో నిర్దేశించిన మేరకు ధాన్యం కొనుగోలు కేంద్రాలు అన్ని ప్రారంభం చేయాలన్నారు. రానున్న మూడు రోజులు వర్షాలను దృష్టిలో ఉంచుకుని వరి కోతలను రైతులు వాయిదా వేసుకునేలా అవగాహన కల్పించాలని తెలిపారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో టార్పాలిన్లు, డ్రయ్యర్లు, ధాన్యం శుభ్రం చేసే యంత్రాలు సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు మాట్లాడుతూ సూర్యాపేట జిల్లాలో కూడా తుఫాన్ ప్రభావం చూపనుందన్నారు. ఇతర రాష్ట్రాల నుంచి ధాన్యం రాకుండా చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి అడ్డుకోవాలన్నారు. ధాన్యంతోపాటు పత్తి, మొక్కజొన్న పంటల తేమశాతాన్ని జాగ్రత్తగా పరిశీలించాలన్నారు. అనంతరం కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటి వరకు 274 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించినట్లు తెలిపారు. కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ కె.సీతారామారావు, డీఎస్‌వో మోహన్‌బాబు, సివిల్ సప్లయ్ డీఎం రాము, డీఏవో శ్రీధర్‌రెడ్డి, డీఎంవో నాగేశ్వరశర్మ, డీసీవో పద్మ, ఏపీడీ సురేష్, బెనర్జీ, ఏఎస్‌వో శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలి

ఎమ్మెల్సీ శ్రీపాల్‌రెడ్డి

సూర్యాపేటటౌన్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఉద్యోగ, ఉపాధ్యాయుల పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పింగళి శ్రీపాల్‌రెడ్డి అన్నారు. సోమవారం జిల్లాకేంద్రంలో పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు తంగేళ్ల జితేందర్‌రెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన జిల్లా కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో పంచాయతీరాజ్ ఉపాధ్యాయులకు అన్నివసతులు కల్పించిన ఘనత పీఆర్‌టీయూకే దక్కిందన్నారు. సర్వీస్‌లో ఉన్న ఉపాధ్యాయులకు టెట్ నిబంధనను రద్దు చేసేందుకు అటు ప్రభుత్వంపై, ఇటు కోర్టులో న్యాయపోరాటం చేస్తున్నట్లు తెలిపారు. 2008 డీఎస్సీ వారి రెగ్యులేషన్‌కోసం కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఇటీవల రాష్ట్రం నుంచి జాతీయ ఉత్తమ ఉపాధ్యాయురాలిగా ఎంపికైన మారం పవిత్రను, రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికైన దండుగుల ఎల్లయ్యను సన్మానించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జితేందర్‌రెడ్డి, తీగల నరేష్, కొల్లు మధుసూదన్‌రావు, కోమటిరెడ్డి నర్సింహారెడ్డి, కాలం నారాయణరెడ్డి, మేకల జానారెడ్డి, రవిందర్‌రెడ్డి, బొల్లు రాంబాబు, కృపాకర్‌రెడ్డి, కోటయ్య, పప్పుల వీరబాబు, రామలింగారెడ్డి, వెంకటయ్య పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

ఇంటర్‌బోర్డు డిప్యూటీ సెక్రెటరీ భీంసింగ్

సూర్యాపేటఅర్బన్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): ఇంటర్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని ఇంటర్‌బోర్డు డిప్యూటీ సెక్రెటరీ భీంసింగ్ అన్నారు. సోమవారం జిల్లాకేంద్రంలోని వివిధ ఇంటర్ కళాశాలలను, ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఆకస్మికంగా తనిఖీ చేసి మాట్లాడారు. ఇంటర్ బోర్డు కమిషనర్ కృష్ణ ఆదిత్య ఆదేశాలమేరకు రాష్ట్రంలోని అన్ని కళాశాలలను పరిశీలిస్తున్నామని తెలిపారు. గత ఏడాది నిర్వహించిన మాదిరిగానే 90రోజుల ప్రణాళికను సిద్ధం చేస్తున్నామన్నారు. నవంబరు నుంచి డిసెంబరు వరకు విద్యార్థులకు ప్రత్యేక తరగతులను నిర్వహించాలన్నారు. వెనుకబడిన విద్యార్థులకు జనవరిలో పునర్ తరగతులను నిర్వహించాలన్నారు. ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు ఫిబ్రవరి మొదటి వారంలో ప్రారంభమై 3వ వారం చివరి వరకు పూర్తవుతాయన్నారు. ఈ ఏడాది లక్ష వరకు రాష్ట్రంలో అడ్మిషన్లు వచ్చాయని వచ్చే విద్యాసంవత్సరానికి విద్యార్థుల సంఖ్య పెంచేలా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో వివిధ కళాశాల ప్రిన్సిపల్, సిబ్బంది పాల్గొన్నారు.

పోలీస్ అమరుల త్యాగాలను స్మరించుకోవాలి

ఎస్పీ కొత్తపల్లి నర్సింహ

సూర్యాపేటక్రైం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): పోలీస్ అమరుల త్యాగాలను ప్రతీ ఒక్కరు స్మరించుకోవాలని ఎస్పీ కొత్తపల్లి నర్సింహ అన్నారు. పోలీస్ అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయం నుంచి చేపట్టిన బైక్ ర్యాలీని ప్రారంభించి మాట్లాడారు. పోలీస్ అమరుల త్యాగాలు ప్రజలకు తెలిపేందుకు బైక్ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పోలీస్ త్యాగాలకు గుర్తుగా ప్రతీ ఒక్కరు సత్ప్రవర్తనలతో నడుచుకోవాలని సూచించారు. సమాజాన్ని పీడిస్తున్న డ్రగ్స్‌ను నిర్మూలించడంలో యువత, ప్రజలు పోలీసులతో భాగస్వామ్యం కావాలన్నారు. యువతపైనే దేశ భవిష్యత్ ఆధారపడి ఉందన్నారు. ర్యాలీలో యువత, పోలీసులు జై జవాన్, జై కిసాన్, జై పోలీస్ అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీలు రవీందర్‌రెడ్డి, జనార్దన్‌రెడ్డి, డీఎస్పీలు ప్రసన్నకుమార్, నర్సింహాచారి, పోలీస్ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు బెల్లంకొండ రాంచందర్‌గౌడ్‌తో పాటు పలువురు సీఐలు, ఎస్‌ఐలు, ఆర్‌ఎస్‌ఐలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



పట్టణంలో బైక్ ర్యాలీలో పాల్గొన్న ఎస్పీ కొత్తపల్లి నర్సింహ, పక్కన అదనపు ఎస్పీలు, పోలీసులు

బాధితులకు అండగా నిలవాలి

అన్యాయానికి గురైన బాధితులకు పోలీసులు అండగా నిలవాలని ఎస్పీ నర్సింహ అన్నారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు అందించిన ఫిర్యాదులను స్వీకరించి వారితో మాట్లాడారు. శాంతి భద్రతలను పరిరక్షించే విషయంలో ప్రజలను భాగస్వామ్యం చేయాలన్నారు. ప్రతీ విషయాన్ని చట్ట పరిధిలో పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజలు అత్యవసర సమయంలో డయల్ 100, జిల్లా పోలీస్ కంట్రోల్ రూం నెంబరు 8712686057కు ఫోన్ చేయాలన్నారు.

పోలీస్ అమరవీరుల త్యాగాలు వృథా కానివ్వం

విధి నిర్వహణలో ప్రాణాలర్పించిన పోలీస్ అమరవీరుల త్యాగాలను వృథా కానివ్వమని ఎస్పీ నర్సింహ అన్నారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి సూర్యాపేట పట్టణంలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కొవ్వొత్తుల ర్యాలీని ప్రారంభించి మాట్లాడారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ కార్యక్రమాల్లో ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని శ్రద్ధాంజలి ఘటించడం సంతోషదాయకమన్నారు. సూర్యాపేట పట్టణంలోని పీఎస్‌ఆర్ సెంటర్ నుంచి పూల సెంటర్ మీదుగా కోర్టు చౌరస్తాలో గల కల్నల్ సంతోష్‌బాబు విగ్రహం వరకు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో డీఎస్పీలు ప్రసన్నకుమార్, నర్సింహాచారి, సూర్యాపేట రూరల్ సీఐ గురుకుల రాజశేఖర్, ఎస్‌బీఐ రామారావు, పట్టణ ఎస్‌ఐలు శివతేజ, సురేష్, ట్రాఫిక్ ఎస్‌ఐ ఆర్.సాయిరాం తదితరులు పాల్గొన్నారు.

రైతులను ఇబ్బంది పెట్టొద్దు

అదనపు కలెక్టర్ సీతారామారావు



ప్రజల నుంచి దరఖాస్తులు తీసుకుంటున్న అదనపు కలెక్టర్ కొలనుపాక సీతారామారావు

సూర్యాపేట(కలెక్టరేట్), అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులను ఇబ్బంది పెట్టొద్దని అదనపు కలెక్ట ర్ కొలనుపాక సీతారామారావు అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు అందించిన దరఖాస్తులను స్వీకరించి మాట్లాడారు. రాబోయే రెండు, మూడు రోజుల్లో జిల్లాలో వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడవకుం డా టార్పాలిన్ అందుబాటులో ఉంచాలన్నారు. ధాన్యం కొనుగోలు కేం ద్రాల నిర్వాహకులు కొనుగోలు కేంద్రాల వద్ద అందుబాటులో ఉండాలన్నారు. ప్రజావాణిలో వచ్చిన ప్రతీ ఫిర్యాదును సంబంధిత అధికారులు వెంటనే పరిష్కరించాలన్నారు. ప్రజావాణికి జిల్లా అధికారులు విధిగా హాజరుకావాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్డీవో వేణుమాధవ్, సీపీవో కిషన్, జిల్లా సంక్షేమాధికారులు నర్సింహారావు, దయానందరాణి, శంకర్, శ్రీనివాసనాయక్, హౌసింగ్ పీడీసిద్దార్థ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా కార్తీక పూజలు

శివాలయంలో భక్తుల రద్దీ



కార్తీక మాసం సోమవారం పర్వదినం సందర్భంగా ప్రత్యేక అలంకరణలో శంభులింగేశ్వరస్వామి

మేళ్లచెర్వు, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం మొదటి సో మవారం సందర్భంగా శివాలయానికి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. మండల కేంద్రంలోని ఇష్టకామేశ్వరి సమేత స్వయంభు శం భులింగేశ్వరస్వామి ఆలయానికి ఉదయం నాలుగు గంటల నుంచి భక్తుల రాక మొదలైంది. భక్తులు ఆలయ ప్రాంగణంలో కార్తీక దీపాలు వెలిగించి స్వామి వారిని దర్శించుకున్నారు. మొదట అర్చకులు గణపతి పూజ, రుద్రాభిషేకం నిర్వహించి, స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కోదాడరూరల్ సీఐ ప్రతాప్‌లింగస్వామి మహా అన్నదానం కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో నాగేళ్ల శంభిరెడ్డి, ఆలయ చైర్మన్ శాగంరెడ్డి శంభిరెడ్డి, ఎస్ఐ పరమేష్, ఆలయ అర్చకులు విష్ణువర్ధన్ శర్మ, ధనుంజయశర్మ, సాయి మహేశ్ శర్మ, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కనకదుర్గా దేవాలయంలో కోటి దీపోత్సవం

హుజూర్‌నగర్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కనకదుర్గా దేవాలయంలోని కల్యాణ మండపంలో సోమవారం కోటి దీపోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి పూజల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో నరగిరినాధుని నర్సింహాచార్యులు, బాచిమంచి కొండయ్య, కొట్టు రాము, శ్రీనివాస్, వెంకన్న, బాబు, మహిళా భక్తులు పాల్గొన్నారు.

నాణ్యమైన విత్తనాలతో అధిక దిగుబడి



రైతులకు సలహాలు ఇస్తున్న వ్యవసాయ శాస్త్రవేత్తలు

చివ్వెంల, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): రైతులు నాణ్యమైన విత్తనాన్ని వినియోగిస్తే అధిక దిగుబడి వస్తుందని జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్త డాక్టర్ భద్రునాయక్ అన్నారు. మండలంలోని వల్లభాపురం గ్రామంలో సోమవారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో 'నాణ్యమైన విత్తనం-రైతన్నకు నేస్తం' కార్యక్రమంలో భాగంగా కేఎన్‌ఎమ్-1638 విత్తనాలతో సాగు చేసిన వరి పైరును పరిశీలించి సూచనలు చేశారు.

వ్యవసాయ అధికారుల సూచనలు పాటించాలన్నారు. నాణ్యమైన విత్తనాలు తయారు చేసి, ఇతర రైతులకు తక్కువ ధరకు అందించాలన్నారు. ఈ పథకం ద్వారా రాబోయే మూడేళ్లలో ప్రతీ గ్రామంలో విత్తన స్వయం సమృద్ధి సాధించవచ్చన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి వెంకటేశ్వర్లు, రైతులు జీవరత్నం, మల్లెబోయిన నారాయణ, నల్లపు లింగయ్య, ఉపేందర్, లక్ష్మయ్య, రమణ, వెంకట్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఆత్మగౌరవ ప్రదర్శనకు తరలిరావాలి

- బచ్చలకూరి వెంకటేశ్వర్లు



సమావేశంలో మాట్లాడుతున్న బచ్చలకూరి వెంకటేశ్వర్లు మాదిగ

కోదాడ, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ బీఆర్ గవాయిపై దాడికి నిరసనగా, మందకృష్ణ మాదిగ నాయకత్వంలో నవంబరు 1న హైదరాబాద్‌లో జరిగే దళితుల ఆత్మగౌరవ మహాప్రదర్శనకు తరలి రావాలని ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ జిల్లా అధ్యక్షుడు బచ్చలకూరి వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. సోమవారం పట్టణంలో జరిగిన ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ అనుబంధ సంఘాల నియోజకవర్గ స్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. గవాయిపై దాడి చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోకపోవడం ఎంత వరకు సమంజసమన్నారు. కార్యక్రమంలో ఏపూరి రాజు మాదిగ, కొండపల్లి ఆంజనేయులు, యలవర్తి రాము, వడ్డేపల్లి కోటేష్, పాతకోట్ల నాగరాజు, పిడమర్తి చిన్న వెంకట్రావు, ఆకారపు కొండలు, కుడుముల శ్రీను పాల్గొన్నారు.



యాదాద్రి భువనగిరి జిల్లాకేంద్రంలో లక్కీడ్రా విజేత ఆనందం

లక్కీడ్రాలో.. మద్యం దుకాణం → దక్కిందోచ్

ఎన్నాళ్లుగానో ఎదురు చూసిన విజయం వరించింది. మద్యం టెండర్లకు నిర్వహించిన లక్కీడ్రాలో పలువురు ఎంపికయ్యారు. రెండేళ్లపాటు మద్యం దుకాణాలు దక్కించుకున్న టెండరుదారుల్లో ఆనందం వెల్లివిరిసింది. ఉమ్మడి నల్లగొండ జిల్లావ్యాప్తంగా సోమవారం మద్యం షాపులకు లక్కీడ్రా నిర్వహించారు. డ్రా నిర్వహించే ప్రదేశాలు సందడిగా మారాయి. టెండర్‌దారులు, వారి కుటుంబ సభ్యుల రాకతో వాహనాల సందడి నెలకొంది. ఆ సమీప ప్రదేశాలు వాహనాలతో కిక్కిరిసిపోయాయి. సూర్యాపేట జిల్లాకేంద్రంలో ఎలికట్టి భరత్-శ్రావణి దంపతులు రెండు దుకాణాలు దక్కించుకోవడం విశేషం.



నల్లగొండ జిల్లాకేంద్రంలో విజేతల ఆనందం



నల్లగొండలో డ్రాలో పాల్గొనేందుకు వచ్చిన మహిళలు



నల్లగొండలో డ్రాలో పాల్గొనేందుకు వచ్చిన వారి వాహనాలు



నల్లగొండలో డ్రా అనంతరం వెనుదిరిగిన మహిళలు



సూర్యాపేటలో లక్కీ డ్రాలో రెండు దుకాణాలు దక్కించుకున్న భార్యాభర్తలు ఎలికట్టి భరత్-శ్రావణి

విద్యుదాఘాతంతో రెండు గేదెలు మృతి

రామన్నపేట, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండలంలోని కక్కిరేణి గ్రామంలో విద్యుదాఘాతంతో రెండు గేదెలు సోమవారం మృతి చెందాయి. వివరాల్లోకి వెళితే.. కక్కిరేణి గ్రామానికి చెందిన కన్నెబోయిన నరసింహ గేదెలను మేపుతుండగా విద్యుత్ తీగలు తెగి గేదెలపై పడడంతో అక్కడికక్కడే మృతి చెందాయి.

బాధితులకు సీఈఐఆర్ పోర్టల్ ఓ వరం

నల్లగొండ క్రైం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): సెల్‌ఫోన్ పోగొట్టుకున్న బాధితులకు సీఈఐఆర్ పోర్టల్ ఓ వరంలాంటిదని డీఎస్పీ శివరాంరెడ్డి అన్నారు. సోమవారం వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఫోన్‌లు పోగొట్టుకున్న బాధితులకు సంబంధించి ట్రేస్‌చేసి రికవరీ చేసిన 47 ఫోన్‌లను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెల్‌ఫోన్లకు పాస్‌వర్డ్‌లు పటిష్టంగా పెట్టుకోవాలన్నారు. కార్యక్రమంలో వన్‌టౌన్ సీఐ ఏమిరెడ్డి రాజశేఖర్ రెడ్డితో పాటు, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

మహిళల మెడలో పుస్తెలతాడు చోరీ



బైక్‌పై పారిపోతున్న దొంగలు

త్రిపురారం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): పట్టపగలే మహిళ మెడలో పుస్తెలతాడు చోరీ జరిగిన సంఘటన నల్లగొండ జిల్లా త్రిపురారం మండలం నీలాయిగూడెం గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. ఎస్ఐ కైగురి నరేష్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ ఉమ్మడి శకుంతల పొలానికి వెళ్లి వస్తుండగా ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు బైక్‌పై వచ్చి పుస్తెలతాడును లాక్కొని పరారీ అయ్యారు. శకుంతల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నరేష్ తెలిపారు.

శాలిగౌరారం: ఇంట్లో నిద్రిస్తున్న మహిళ మెడలో నుంచి గుర్తు తెలియని వ్యక్తులు బంగారు గొలుసును చోరీ చేసిన సంఘటన నల్లగొండ జిల్లా శాలిగౌరారం మండలం పెర్కకొండారంలో సోమవారం తెల్లవారుజామున జరిగింది.శాలిగౌరారం ఎస్ఐ డి.సైదులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని పెర్కకొండారం గ్రామానికి చెందిన మన్నె శిరీష కుటుంబసభ్యులతో ఇంట్లో నిద్రిస్తుండగా, గుర్తు తెలియని వ్యక్తులు వచ్చి 3 తులాల బంగారు గొలుసును లాక్కొని వెళ్లారు. శిరీష ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సైదులు తెలిపారు.

వీధికుక్కల దాడిలో గాయాలు

మిర్యాలగూడ అర్బన్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): వీధికుక్కల దాడిలో ఏడేళ్ల విద్యార్థి గాయపడిన సంఘటన నల్లగొండజిల్లా మిర్యాలగూడ పట్టణంలోని హౌసింగ్‌బోర్డు కాలనీలో సోమవారం జరిగింది. స్థానికుల తెలిపిన వివరాల ప్రకారం.. హౌసింగ్ బోర్డుకు చెందిన లావూరి నాగరాజు కుమారుడు హర్షవర్ధన్ పాఠశాలకు వెళ్లి ఇంటికి వస్తుండగా, వీధి కుక్కలు దాడికి పాల్పడ్డాయి. ఈ సంఘటనలో బాలుడు హర్షవర్ధన్ తల, కంటిపై బలమైన గాయాలయ్యాయి.

భువనగిరి రూరల్: భువనగిరి మండలం అనాజీపురం గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల ఆవరణలో ఓ విద్యార్థిని కుక్కలు గాయపరిచాయి. గ్రామానికి చెందిన సిర్పంగ భరత్‌కుమార్ పాఠశాల గదిలోంచి బయటకు వస్తుండగా మోచేతిపై దాడి చేసి గాయపరిచాయి.

సాగర్ కాల్వలో మృతదేహం లభ్యం

మిర్యాలగూడ అర్బన్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి):నల్లగొండజిల్లా మిర్యాలగూడ మండలం కురియతండా వద్ద సాగర్ కాల్వలో గల్లంతైన వృద్ధురాలి మృతదేహం లభ్యమైంది. ఈ నెల 25న తండాకు చెందిన ధనావత్ ద్వారజన్(80) దుస్తులు ఉతకడానికి సాగర్ ఎడమకాల్వలోకి దిగింది. ఈ క్రమంలో పట్టుతప్పి కాల్వలోకి జారిపడి గల్లంతైంది. ఆమె ఆచూకీ కోసం గాలిస్తుండగా సోమవారం గరిడేపల్లి మండలం పొనుగోడు రిజర్వాయర్‌లో స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారమిచ్చినట్లు ఎస్ఐ లక్ష్మయ్య తెలిపారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబసభ్యులకు అప్పగించినట్లు ఎస్ఐ తెలిపారు.

11 మంది జూదరుల అరెస్ట్

మునగాల, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): పేకాడుతున్న 11 మందిని పోలీస్‌లు అరెస్ట్ చేసి సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో బైండోవర్ చేశారు. ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 23న మండలంలోని నర్సింహులగూడెం గ్రామశివారులో రేకుల షెడ్‌లో జూదం ఆడుతున్న వారిని పట్టుకున్నట్లు తెలిపారు. కమ్మంపాటి అశోక్, కమ్మంపాటి శ్రీనివాస్, చింతమళ్ల ప్రభుదాస్, షేక్ సైదా, ఉయ్యాల కాటంరాజు, బెజవాడ వెంకన్న, ముంత కృష్ణ, జుట్టుకొండ రామారావు, బొల్లెద్దు రామకృష్ణ, కేశబోయిన నాగరాజు, బొల్లం సత్యనారాయణపై కేసు నమోదు చేసినట్లు వివరించారు.

ఇసుక లారీ పట్టివేత

కోదాడ రూరల్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా కోదాడ మండలం రామాపురం క్రాస్‌రోడ్డు వద్ద ఇసుక లారీని పట్టుకున్నట్లు రూరల్ ఎస్ఐ గోపాల్‌రెడ్డి తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లోని ఎన్టీఆర్ జిల్లా తోట్లవల్లూరు మండలం రొయ్యూరు నుంచి అనుమతి లేకుండా హైదరాబాద్‌కు లారీలో ఇసుకను తరలిస్తున్నట్లు గుర్తించామన్నారు. లారీ డ్రైవర్ లుక్క నాగరాజు, ఓనర్లపై కేసు నమోదు చేసినట్లు వివరించారు.

వైన్స్ దుకాణంలో స్వల్పంగా మంటలు

మోత్కూరు, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): మోత్కూరు మండల కేంద్రంలో ఆర్ఎస్ వైన్స్‌లో సోమవారం ఉదయం షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగాయి. మూసి ఉన్న దుకాణం నుంచి బయటికి పొగ రావడంతో ఉదయం వేళ ఇరుగు పొరుగు గమనించి దుకాణ యాజమానికి, అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇచ్చారు. వెంటనే దుకాణం వద్దకు చేరుకొని మంటలు ఆర్పారు. దుకాణంలో విద్యుత్ సరఫరాను నియంత్రించే స్టెబిలైజర్‌లో షార్ట్ సర్క్యూట్ కావడంతో మంటలు వచ్చినట్లు ప్రాథమికంగా నిర్ధారించారు. ఈ ఘటనలో ఎలాంటి ఆస్తి నష్టం జరగలేదని యజమాని తెలిపారు.

పేదల బియ్యం.. పెద్దలదందా

● దేవరకొండ డివిజన్‌లో రేషన్ బియ్యం అక్రమ రవాణా
● అధికారులు తనిఖీలు చేసినా ఆగని వైనం

దేవరకొండ డివిజన్‌లో రేషన్ బియ్యం అక్రమ రవాణా కొనసాగుతూనే ఉంది. రేషన్ బియ్యాన్ని పక్కదారి పట్టిస్తే సంబంధిత డీలర్లు, రేషన్‌కార్డు వినియోగదారులపై చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరిస్తున్నా అక్రమ రవాణా ఆగడంలేదు. పౌరసరఫరాలశాఖ, పోలీస్ అధికారులు తనిఖీలు చేపట్టి అక్రమంగా రవాణా అవుతున్న బియ్యాన్ని స్వాధీనం చేసుకొని కేసులు నమోదు చేస్తున్నా, బియ్యం అక్రమ రవాణా ఆగడంలేదు. రేషన్ బియ్యాన్ని పక్కదారి పట్టిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోకపోవడమే ఇందుకు కారణం.

(ఆంధ్రజ్యోతి-దేవరకొండ)

నిరుపేదల కోసం ప్రభుత్వం ఉన్నతమైన ఆశయంతో సన్నబియ్యాన్ని పంపిణీ చేస్తుంది. దేవరకొండ డివిజన్‌లోని మండలాల్లోని రేషన్ దుకాణాలకు ప్రధాన గోదాం నుంచి 115,22 క్వింటాళ్లు, 230 రేషన్ దుకాణాలకు సరఫరా చేస్తున్నారు. కానీ కొంతమంది డీలర్లు వినియోగదారుల నుంచి బియ్యాన్ని కిలోకు రూ.15నుంచి రూ.16వరకు అందజేసి బియ్యాన్ని కొనుగోలు చేసి వ్యాపారులకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. వ్యాపారులు, దళారులు రేషన్ బియ్యాన్ని మిల్లులకు తరలించి రూ.25 నుంచి 30వరకు విక్రయిస్తున్నారు. తాజాగా ఈ నెల 24న చింతపల్లి మండలం నసర్లపల్లి నుంచి వాహనంలో సంపతయ్య, మరియాబి, డ్రైవర్ శివలు రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేసి కల్వకుర్తికి తరలిస్తుండగా దేవరకొండ పట్టణ శివారులో సీఐ వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించి 20క్వింటాళ్ల బియ్యాన్ని పట్టుకొని సీజ్ చేసి ముగ్గురుపై కేసు నమోదు చేశారు. సెప్టెంబరు 14న నాంపల్లి మండలం నర్సింహులగూడెం రైస్ మిల్లులో రేషన్ బియ్యం నిలువ ఉండడంతో డీటీసీఎస్ రఘునందన్ తనిఖీలు చేసి, 30 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పట్టుకొని మిల్లును సీజ్ చేశారు.



దేవరకొండలో పోలీసులు స్వాధీనం చేసుకున్న బియ్యం(ఫైల్)



దేవరకొండలో గోదాంను తనిఖీ చేస్తున్న ఆర్డీవో రమణారెడ్డి (ఫైల్)

కేసులు నమోదు.. బియ్యం సీజ్ చేస్తున్నా..

దేవరకొండ డివిజన్‌లో చందంపేట, నేరేడుగొమ్ము, దేవరకొండ, పీఏపల్లి, చింతపల్లి, కొండమల్లేపల్లి, మండలాల్లో రేషన్ బియ్యం అక్రమ రవాణా జరుగుతూనే ఉంది. గతంలో దేవరకొండ మండలం ఎల్లారెడ్డిబావి వద్ద అక్రమంగా తరలిస్తున్న 30 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని దేవరకొండ పోలీసులు పట్టుకున్నారు. దేవరకొండ మండలం తెలుగుపల్లిలో వినియోగదారుల నుంచి రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేసి ఇంట్లో నిల్వ ఉంచిన ఆరు క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని దేవరకొండ పోలీసులు పట్టుకొని శ్రీను అనే వ్యాపారిపై కేసు నమోదు చేశారు. ఇద్దంపల్లి నుంచి బొలెరో వాహనంలో అక్రమంగా తరలిస్తున్న 24 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పోలీసులు పట్టుకొని సీజ్ చేశారు. పౌరసరఫరాలశాఖ, టాస్క్‌ఫోర్స్ దేవరకొండ ఆర్డీవో రమణారెడ్డిలు తనిఖీలు చేపడుతున్నా, అక్రమ రవాణా కొనసాగుతూనే ఉంది. దేవరకొండ మండలానికి చెందిన కొంతమంది డీలర్లు బొలెరో వాహనాలను కొనుగోలుచేసి సొంత వాహనాల్లోనే బియ్యాన్ని నాగర్‌కర్నూల్, చారకొండ ప్రాంతాలకు తరలిస్తున్నారు. పోలీస్, పౌరసరఫరాలశాఖ, టాస్క్‌ఫోర్స్ అధికారులు విస్తృతంగా తనిఖీలు చేపట్టి రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

పక్కదారిపట్టిస్తే కఠిన చర్యలు

రేషన్ బియ్యాన్ని పక్కదారి పట్టిస్తే తనిఖీలు నిర్వహించి కేసులు నమోదు చేస్తాం. రేషన్ డీలర్లు సన్నబియ్యాన్ని వినియోగదారులకు ఇవ్వాలి. అక్రమాలకు పాల్పడితే డీలర్‌షిప్ రద్దు చేస్తాం. వినియోగదారులు బియ్యాన్ని ఇతరులకు విక్రయిస్తే రేషన్‌కార్డులు రద్దుచేస్తాం. ఒకే వ్యక్తి రెండు సార్లు పట్టుబడితే పీడీ యాక్ట్ కింద కేసు నమోదు చేస్తాం.

ముబిన్, డీటీసీఎస్, దేవరకొండ

వేర్వేరు ఘటనల్లో ముగ్గురి మృతి

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో జరిగిన వేర్వేరు ఘటనల్లో ముగ్గురు మృతి చెందారు. కేతేపల్లి మండలంలో ఒకరు, భువనగిరి మండలంలో ఇద్దరు సోమవారం మృత్యువాతపడ్డారు.

కేతేపల్లి, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా కేతేపల్లి మండలం 65వ నెంబరు జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో గొర్రెలకాపరి, నాలుగు గొర్రెలు మృతి చెందాయి. పోలీసులు, స్థానికుల వివరాల ప్రకారం.. సూర్యాపేట జిల్లాలోని ఆత్మకూర్(ఎస్)మండలం మిడతనపల్లి గ్రామానికి చెందిన బయ్య పాపయ్య(50) అదే గ్రామానికి చెందిన పరాల గంగయ్య, పరాల మహేష్‌తో కలిసి కొద్దిరోజుల క్రితం తమ గొర్రెల మందను తీసుకొని మేతకోసం నల్లగొండ జిల్లా కేంద్ర పరిసరాల్లోకి వెళ్లారు. తిరిగి ఆదివారం రాత్రి స్వగ్రామానికి బయలుదేరారు. కేతేపల్లి మండలంలోని చీకటిగూడెం సమీపంలో కొన్ని గొర్రెలు హైవే మీదకు పరుగెత్తడంతో పాపయ్య వాటిని పక్కకు కొడుతుండగా అదే సమయంలో విజయవాడ వైపు నుంచి హైదరాబాద్ వైపు అతివేగంగా వెళుతున్న కారు గొర్రెలను, పాపయ్యను ఢీకొట్టి ముందుకు వెళ్లింది. దీంతో తీవ్రగాయాలైన పాపయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ప్రమాదంలో పాపయ్యతోపాటు మరో నాలుగు గొర్రెలు మృత్యువాతపడ్డాయి. స్థానికుల సమాచారం మేరకు సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు పాపయ్యను నకిరేకల్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. అక్కడ పాపయ్యకు పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. పాపయ్య కుమారుడు మధు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని కేతేపల్లి ఎస్ఐ సతీష్ వివరించారు. కాగా మృతుడు పాపయ్యకు భార్య, ఇద్దరు కుమార్తెలు, ఓ కుమారుడు ఉన్నారు.



ప్రమాదంలో మృతి చెందిన గొర్రెలు



బయ్య పాపయ్య (ఫైల్)



చెక్క రమేష్(ఫైల్)

యాదాద్రి భువనగిరి జిల్లాలో..

భువనగిరి టౌన్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రం భువనగిరిలో సోమవారం వేర్వేరు ఘటనలో ఇరువురు మహిళలు మృతి చెందారు. పట్టణ ఇన్‌స్పెక్టర్ ఎన్ రమేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. సుమారు 45-50 ఏళ్ల వయస్సు గల గుర్తు తెలియని మహిళ మృతదేహం స్థానిక హైదరాబాద్ చౌరస్తా వద్ద లభించింది. మృతురాలు ఒంటిపై బూడిద రంగు చీర, గులాబీ రంగు జాకెట్టు ఉన్నాయి. మృత దేహాన్ని జిల్లా ఆసుపత్రి మార్చురీలో భద్రపరిచారు. మరో ఘటనలో లక్ష్మీ (60) అనే మహిళ బస్టాండ్‌లో అనారోగ్యంతో ఉండడాన్ని గమనించి జిల్లా ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. ఆమె ఒంటిపై పసుపు రంగు చీర, తెల్ల రంగు జాకెట్టు ఉంది. మృతదేహాన్ని జిల్లా ఆసుపత్రిలో భద్రపరిచారు. మృతదేహాల ఆచూకీ కోసం సెల్ నెంబర్లు ఎస్ఐ నరేశ్ సెల్:8712662491, పోలీస్ స్టేషన్ నెంబర్ సెల్:8712662803, ఎస్‌హెచ్‌వో సెల్:8712662471కు సంప్రదించాలని సూచించారు.

పాముకాటుకు గురై...

భూదాన్‌పోచంపల్లి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): యాదాద్రి భువనగిరి జిల్లా భూదాన్‌పోచంపల్లి పట్టణానికి చెందిన చెక్క రమేష్ (34) ఈ నెల 13న తన వ్యవసాయ పొలంలో పనిచేస్తుండగా, పాము కాటేసింది. చికిత్స నిమిత్తం హైదరాబాద్ తరలించారు. పరిస్థితి విషమించడంతో గాంధీ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న రమేష్ సోమవారం మధ్యాహ్నం మృతి చెందారు. రమేష్ ఫొటోగ్రాఫర్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. రమేష్‌కు భార్య, ఒక కుమారుడు ఉన్నారు. అతని భార్య ప్రస్తుతం గర్భిణిగా ఉంది. ఫొటోగ్రాఫర్ అసోసియేషన్ అధ్యక్షుడు దోర్నాల గణేష్ ఆధ్వర్యంలో సభ్యులు రమేష్ మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు.

కూచిపూడి నృత్యంలో ఉచిత శిక్షణ

నల్లగొండ, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లాకేంద్రంలోని ఆర్యవైశ్య భవన్‌లో ఉచితంగా అందించే కూచిపూడి నృత్య శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని ఆర్య వైశ్య భవన్ అధ్యక్షులు భాస్కర్, నాంపల్లి భాగ్య కోరారు. నృత్యం నేర్చుకోవాలని తపన ఉండి, ఆర్థికంగా వెనుకబడిన వారు రామగిరిలోని కనకదుర్గ ఆలయ సమీపంలోని ఆర్య వైశ్య భవన్‌లో పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. ప్రతీ ఆదివారం సాయంత్రం 5గంటల నుంచి 6.30గంటలకు శిక్షణ ఉంటుందన్నారు. 6వ, 7వ, 8వ తరగతి విద్యార్థులు హాజరుకావొచ్చని తెలిపారు.

శివలీలారెడ్డికి మదర్‌థెరిస్సా అవార్డు

కనగల్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రానికి చెందిన న్యాకంబాల శివలీల ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు శివలీలారెడ్డిని మదర్‌థెరిస్సా అవార్డు వరించింది. ఆంధ్రప్రదేశ్‌లోని సత్తుపల్లి పట్టణంలోని మస్తాన్ ఐటీ కళాశాలలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో మదర్ థెరిస్సా అవార్డును ప్రదానం చేశారు. శివలీలారెడ్డి చేస్తున్న సామాజిక సేవా కార్యక్రమాలను కొనియాడారు. ఈ సందర్భంగా శివలీలారెడ్డి మాట్లాడుతూ మదర్ థెరిస్సా అవార్డును అందుకోవటం ఆనందంగా ఉందన్నారు.

అనూషరెడ్డికి కన్నీటి వీడ్కోలు

● మంత్రి, ఎంపీ, ఎమ్మెల్యేల నివాళి





అనూషరెడ్డి మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు, కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మంత్రి వెంకట్‌రెడ్డి, ఎంపీ కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే అయిలయ్య

గుండాల, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కర్నూలులో జరిగిన బస్సు ప్రమాదంలో సజీవ దహనమైన మహేశ్వరం అనూషరెడ్డికి కన్నీటి వీడ్కోలు పలికారు. ఆదివారం రాత్రి యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండలం వస్తాకొండూరుకు అనూషరెడ్డి మృతదేహాన్ని తీసుకొచ్చారు. అయితే ప్రమాదం జరిగిన తీరుతో అనూషరెడ్డి మృతదేహాన్ని గుర్తించడం కష్టమైంది. అనూషరెడ్డి తల్లిదండ్రులు విజిత, శ్రీనివాస్‌రెడ్డిల రక్త నమూనాలు తీసుకుని డీఎన్ఏ పరీక్ష చేసి అధికారులు అనూషరెడ్డి మృతదేహాన్ని గుర్తించి వస్తాకొండూరులోని బంధువులకు అప్పగించారు. అయితే సోమవారం అనూషరెడ్డి అంత్యక్రియలు నిర్వహించారు. అల్లారు ముద్దుగా పెంచుకుతున్న తమ కుమార్తె మృత్యువాత పడడంతో తల్లి దండ్రులు శోకసముద్రంలో మునిగిపోయారు. ఇదిలా ఉంటే అనూషరెడ్డికి తెలంగాణ ప్రభుత్వం రూ.5లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించి, ఆ సొమ్ము పత్రాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు.

పరామర్శించిన మంత్రి, ఎంపీ

బస్సు ప్రమాదంలో మృతి చెందిన అనూషరెడ్డి కుటుంబాన్ని సోమవారం మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, ఎంపీ చామల కిరణ్‌కుమార్ రెడ్డి, ఎమ్మెల్యే బీర్ల అయిలయ్యలు పరామర్శించారు. వస్తాకొండూరులోని అనూషరెడ్డి ఇంటికి చేరుకొని అనూషరెడ్డి తల్లిదండ్రులు విజిత, శ్రీనివాస్ రెడ్డిలకు ధైర్యం కల్పించారు. ఈ సందర్భంగా అనూషరెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

యువకుడి నుంచి గంజాయి స్వాధీనం



గంజాయిని స్వాధీనం చేసుకుంటున్న పోలీసులు

భూదాన్‌పోచంపల్లి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): భూదాన్‌పోచంపల్లిలో యువకుడి నుంచి పోలీసులు గంజాయి స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ భాస్కర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ముక్తాపూర్ గ్రామనివాసి మునుకుంట్ల శివకుమార్ బైక్‌పై గంజాయి తీసుకెళ్తుండగా సోమవారం పట్టుకున్నారు. అతని నుంచి 80 గ్రాముల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఎంపీవోకు త్రుటిలో తప్పిన ప్రమాదం

మర్రిగూడ, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మర్రిగూడ మండల ఎంపీవో రవికుమార్ కారును ఆర్టీసీ బస్సు ఢీకొనగా, త్రుటిలో పెను ప్రమాదం తప్పింది. మర్రిగూడ ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీవోగా విధులు నిర్వహిస్తున్న రవికుమార్ హైదరాబాద్‌లో నివాసం ఉంటున్నారు. విధుల నిమిత్తం సోమవారం మర్రిగూడ మండలానికి సొంత కారులో వస్తుండగా ప్రమాదవశాత్తు రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం ఆర్టీసీ డిపో సూపర్ డీలక్స్ బస్సు వెనుక నుంచి ఢీకొట్టింది. ఘటనలో కారు బోల్తా పడినప్పటికీ కారు డ్రైవింగ్ చేస్తున్న తనకు ఎలాంటి ప్రమాదం జరగలేదని, స్వల్ప గాయాలతో బయటపడడం వల్ల తృటిలో పెను ప్రమాదం తప్పినట్లు ఎంపీవో తెలిపారు. స్వల్ప గాయాలతో విధులకు హాజరైన ఎంపీవోను వివిధ శాఖలకు చెందిన అధికారులు పరామర్శించి యోగక్షేమాలు తెలుసుకున్నారు.

యాద'గిరి'పై కార్తీక దీపోత్సవం



యాదగిరిగుట్ట: శివాలయ ప్రాంగణంలో దీపోత్సవంలో అధికారులు, భక్తులు

యాదగిరిగుట్ట, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి దివ్య క్షేత్రంలో కార్తీక మాసం మొదటి సోమవారం కావడంతో శివాలయ ప్రాంగణంలో అధిక సంఖ్యలో మహిళ భక్తులు కార్తీక దిపోత్సవం నిర్వహించి, మొక్కులు చెల్లించారు. దేవాదాయ శాఖ అనుమతితో ధార్మిక, ఆధ్యాత్మిక కార్యక్రమాలు అధికారులు నిర్వహించారు. భక్తుల్లో ఆధ్యాత్మికతను, సంప్రదాయాలను ప్రోత్సహించే లక్ష్యంతో దేవస్థానం ప్రత్యేక కార్యక్రమం చేపట్టింది. కాగా ప్రధానాలయంలో నిత్యపూజలు శాస్త్రోక్తంగా కొనసాగాయి. శివాలయంలో అభిషేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఇన్‌చార్జి డీఈవో జూసెట్టి కృష్ణ, ఏఈవో గజ్వేల్ రఘు, ప్రధాన అర్చకుడు బట్టర్ సురేంద్ర చార్యులు బృందం, పర్యవేక్షకుడు సీతారామాచార్యులు పాల్గొన్నారు.

ఆళ్వార్లకు పురప్పాట్టు సేవ : లక్ష్మీనరసింహస్వామి వారి ఆలయంలో సోమవారం మనవాళ మహాముని తిరునక్షత్రోత్సవాలు పండితులు వైభవంగా నిర్వహించారు. ఆళ్వార్లలకు పురప్పాట్టు సేవ చేస్తూ ప్రబంధ పాశురాలను పఠనంతో మాడవీధుల్లో ఊరేగించారు. కలెక్టర్ హనుమంతరావు, ఇన్‌చార్జి డీఈవో జూశెట్టి కృష్ణ, ఏఈవో గజ్వేల్ రఘు, పర్యవేక్షకుడు సీతారామాచార్యులు బృందం, ప్రధాన అర్చకుడు బట్టర్ సురేంద్రాచార్యులు పాల్గొన్నారు.

మఠంపల్లి: మట్టపల్లి శ్రీ లక్ష్మీనరసింహుని క్షేత్రంలో నిత్య కల్యాణం వైభవంగా నిర్వమించారు. కార్తీక సోమవారం కావడంతో శివాలయంలో ప్రత్యేక పూజలు కొనసాగాయి.

భూనిర్వాసితుల గోడు పట్టదా?



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న జాతీయ రహదారి-930 భూనిర్వాసితులు (ఫైల్)

- ఆందోళనలో గౌరెల్లి-భద్రాచలం జాతీయ రహదారి నిర్వాసితులు
- బాధితులకు అందని పరిహారం

భూదాన్‌పోచంపల్లి, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): యాదాద్రి భువనగిరి జిల్లాలో భూ నిర్వాసితుల గోడు పట్టించుకునే వారే కరువయ్యారు. దీంతో పరిహారం కోసం వారు ఏళ్ల తరబడి ఎదురు చూస్తూనే ఉన్నారు. గౌరెల్లి - భద్రాద్రి కొత్తగూడెం జాతీయ రహదారి-930 యాదాద్రి భువనగిరి జిల్లాలోని భూదాన్‌పోచంపల్లి, వలిగొండ మండలాల మీదుగా వెళుతోంది. ఈ రహదారి నిర్మాణంలో భూములు కోల్పోతున్న భూనిర్వాసితులు, రైతులకు ఇప్పటివరకు నష్టపరిహారం చెల్లించలేదు. ఎంతో కాలంగా నిర్వాసితులు అధికారులను కలిసి విన్నవించుకున్నా వారి మొర ఆలకించడంలేదని నిర్వాసితులు తీవ్ర ఆవేదన చెందుతున్నారు. భూములు కోల్పోతున్న రైతులకు 'బుక్ వాల్యూ' ప్రకారం కాకుండా బహిరంగ మార్కెట్ వాల్యూ ప్రకారం రేటు చెల్లించాలని గౌరెల్లి-భద్రాద్రి కొత్తగూడెం జాతీయ రహదారి భూనిర్వాసితుల కమిటీ తరఫున ఇప్పటికే కలెక్టర్‌తోపాటు అధికారులకు వినతి పత్రాలు అందజేశారు. అనేకసార్లు సమావేశాలు నిర్వహించినా, సమస్య పరిష్కరించాలని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వరిసాగుపై ఆధారం

జిల్లాలోని భూదాన్‌పోచంపల్లి, వలిగొండ మండలాల నుంచి మూసీ ప్రవహిస్తుండడంతో ఆ నీటిని ఆధారం చేసుకుని ఆయకట్టులోని రైతాంగం పూర్తిగా వరి సాగుపై ఆధారపడింది. బహిరంగ మార్కెట్లో ఈ ప్రాంతంలో భూమి ధర ఎకరం రూ.1కోటి 20 లక్షల నుండి రూ. 3కోట్ల వరకు పలుకుతుందని నిర్వాసితులు పేర్కొంటున్నారు. ఇలాంటి అతి ఖరీదైన భూములను రోడ్డు నిర్మాణం కోసం భూసేకరణ చేసిన ప్రభుత్వం ఎకరం రూ.24 లక్షలు మాత్రమే ఇస్తామనడం వల్ల నష్టపోతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

తరతరాలుగా సాగుచేసుకుంటున్న రైతుల వ్యవసాయ భూములను జాతీయ రహదారి నిర్మాణం కోసం శాశ్వతంగా ఉపాధి కోల్పోవాల్సిన పరిస్థితి వస్తుందని బాధితులు తమ గోడు వినిపిస్తున్నారు. రోడ్డు నిర్మాణం కోసం వందల కోట్ల రూపాయలను ఖర్చు పెడుతున్న కేంద్ర ప్రభుత్వం భూనిర్వాసితులకు నష్టపరిహారం కోసం ఎందుకు ఖర్చు పెట్టదని వారు ప్రశ్నిస్తున్నారు. బహిరంగ మార్కెట్ ప్రకారం రేటు చెల్లించకపోతే భూమికి - భూమి ఇవ్వాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు.

ఎనిమిది ఎకరాల సాగుభూమిని కోల్పోతున్నా



గౌరెల్లి-భద్రాద్రి కొత్తగూడెం జాతీయ రహదారి నిర్మాణంలో మా భూమి నుంచి అధికంగా 8 ఎకరాల మేరకు భూమిని కోల్పోతున్నా. ప్రభుత్వం బహిరంగ మార్కెట్ ధర ప్రకారం చెల్లించాలి. కనీసం ఎకరా రూ. 40 లక్షలు తగ్గకుండా చెల్లించాలి.

- శేఖర్‌రెడ్డి, భూనిర్వాసితుడు, దంతూరు

నష్టపరిహారం వెంటనే చెల్లించాలి



భూదాన్‌పోచంపల్లి మండలం కనుముకుల గ్రామానికి చెందిన నా కుటుంబ సభ్యులకు సంబంధించిన మొత్తం 3 ఎకరాల 21 గుంటల భూమిని కోల్పోతున్నాం. ఇందుకు ప్రభుత్వం ఎకరాకు అతి తక్కువగా రూ.24 లక్షలు మాత్రమే చెల్లిస్తామని ప్రకటించింది. అయితే బహిరంగ మార్కెట్ ధర చొప్పున ఎకరాకు 60 లక్షలు కనీసం చెల్లించాలి. ప్రభుత్వం అందించే అరకొర సాయం ఇప్పటికీ అందలేదు.

- భూపాల్‌రెడ్డి, కనుముకుల, భూనిర్వాసిత రైతు

భూసేకరణ చేసి..

రంగారెడ్డి జిల్లా గౌరెల్లి నుంచి యాదాద్రి భువనగిరి జిల్లాలోని పిలాయిపల్లి, జగత్‌పల్లి, జూలూరు, పోచంపల్లి, మెహర్‌నగర్, భీమనపల్లి, కనుముకుల, దంతూరు, వంకమామిడి, ధర్మారెడ్డిపల్లి, సంగెం, పొద్దుటూరు, రెడ్ల రేపాక, లోతుకుంట గ్రామాల్లో భూసేకరణ చేపట్టిన ప్రభుత్వం 15 గ్రామాల్లో 455 ఎకరాల భూసేకరణ చేసింది. 42 కిలోమీటర్ల పొడవున జిల్లా మీదుగా జాతీయ రహదారి నిర్మాణం చేపట్టనుంది. భూదాన్‌పోచంపల్లి మండలంలోని పిలాయిపల్లిలో 30-02 ఎకరాలు, జగత్‌పల్లిలో 10-06 1/2, పోచంపల్లిలో 53-19, జూలూరులో 15-39 1/2, భీమనపల్లిలో 23-07, మెహర్‌నగర్‌లో 8-07 1/2, కనుముకులలో 26-01 1/2, దంతూరులో 25-05, వంకమామిడిలో 20-26, ధర్మారెడ్డిపల్లిలో 16-14 ఎకరాల చొప్పున మొత్తం 229.08 ఎకరాల భూమిని ప్రభుత్వం సేకరించింది. ప్రభుత్వం బహిరంగ మార్కెట్ రేటులో నగం ధరనైనా కట్టించాలని బాధితులు వేడుకుంటున్నారు. ఇప్పటి వరకు భూనిర్వాసితులకు పరిహారం అందలేదు. ఇప్పటికైనా సత్వరమే భూనిర్వాసితులకు పరిహారం చెల్లించాల్సిందిగా కోరుతున్నారు.

14 ఎంఎల్‌హెచ్‌పీ ఉద్యోగాలకు 353 దరఖాస్తులు

- నేటి నుంచి దరఖాస్తుల పరిశీలన
- నవంబరు 10న ఫైనల్ మెరిట్ లిస్టు



దరఖాస్తులు చేసుకుంటున్న అభ్యర్థులు

భువనగిరి (కలెక్టరేట్), అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): జిల్లా వైద్య ఆరోగ్య శాఖ పరిధిలోని ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాల్లో ఖాళీగా ఉన్న 14 మిడ్ లెవల్ హెల్త్‌ప్రొవైడర్ (ఎంఎల్‌హెచ్‌పీ) ఉద్యోగాలకు అభ్యర్థులు సోమవారం భారీగా దరఖాస్తులు చేసుకున్నారు. ఎంబీబీఎస్, బీఏఎంఎస్, స్టాఫ్ నర్స్, బీఎస్సీ నర్సింగ్, జీఎన్ఎం అర్హతతో కమ్యూనిటీ హెల్త్‌లో ఆరు నెలల బ్రిడ్జి కోర్సు చేసిన వారికి అర్హత కల్పిస్తూ ఈ నెల 23 నుంచి 27 వరకు దరఖాస్తులు స్వీకరించారు. ఖాళీగా ఉన్న 14 పోస్టులకు గాను దరఖాస్తుల స్వీకరణ ముగింపు సమయానికి సుమారు 353 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. వచ్చిన దరఖాస్తులను నేటి నుంచి ఈ నెల 31 వరకు పరిశీలించి, నవంబరు 1 నుంచి 4వ తేదీ వరకు ప్రొవిజినల్ మెరిట్ లిస్టు ప్రదర్శించడంతో పాటు అభ్యంతరాలు, ఆక్షేపణలు స్వీకరించనున్నారు. నవంబరు 10న ఫైనల్ మెరిట్ లిస్టును ప్రదర్శించి సర్టిఫికెట్ పరిశీలన కౌన్సిలింగ్ నిర్వహించనున్నారు.

ఆ ముగ్గురు నేతలపై కేసు నమోదుచేయాలి



యాదగిరిగుట్ట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న ఎంపీ కిరణ్‌కుమార్‌రెడ్డి, విప్ అయిలయ్య

యాదగిరిగుట్ట రూరల్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): పదేళ్లపాటు తెలంగాణను దోచుకున్న బీఆర్ఎస్ నేతలు తన్నీరు హరీ‌ష్‌రావు, సంతో‌ష్‌రావు, నవీన్‌రావులపై కేసు నమోదుచేసి విచారణ చేయాలని భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య కోరారు. సోమవారం ఈ మేరకు యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట పోలీస్‌స్టేషన్‌లో సీఐ బొడ్డుపల్లి భాస్కర్‌రావుకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నీళ్లు, నిధులు, నియామకాల పేరుతో అధికారంలోకి వచ్చిన కేసీఆర్‌ను తప్పుదోవ పట్టించి 10సంవత్సరాలు తెలంగాణను దోచుకున్న ఆ ముగ్గురు నేతలపై కేసు నమోదు చేయాలన్నారు. పదేళ్లపాటు అధికారంలో ఉన్నప్పుడు నోరు మెదపని కవిత అధికారం పోయిన తరువాత వారి కుటుంబ సభ్యులపై అవినీతి ఆరోపణలు చేస్తున్నారని అన్నారు. హరీ‌ష్‌రావు, సంతో‌ష్‌రావు, నవీన్‌రావులు కలిసి సంపదను దోచుకున్నారని ఆమె చేసిన ఆరోపణలపై బీఎన్ఎస్ యాక్టు 173 ద్వారా విచారణ జరిపించాలని కోరారు. బీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి రాకముందు రాష్ట్రం మిగులు బడ్జెట్‌తో ఉండేదన్నారు. 10 సంవత్సరాల బీఆర్ఎస్ పాలనలో అప్పుల రాష్ట్రంగా మార్చారని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ సంపదను దోచుకున్న బీఆర్ఎస్ నాయకులు రెండు సంవత్సరాల కాంగ్రెస్ పాలనపై చిల్లర ఆరోపణలు చేయడం అవివేకమని అన్నారు. గత పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను ప్రజలు ఓడించినప్పటికీ బుద్ధిరాలేదని, త్వరలో జరగనున్న జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో ఎవరి సత్తా ఏమిటో ప్రజలే నిర్ణయిస్తారని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు అన్నం సంజీవరెడ్డి, ఆలేరు మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ అయినాల చైతన్యమహేందర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ చీర శ్రీశైలం, మండల పట్టణ అధ్యక్షుడు మంగ సత్యనారాయణ, బందారపు భిక్షపతిగౌడ్, మాజీ కౌన్సిలర్లు గుండ్లపల్లి వాణిభరత్‌గౌడ్, ముక్కెర్ల మల్లేష్, హేమేందర్‌గౌడ్ పాల్గొన్నారు.

పునాదులకే పరిమితం



పునాది దశలోనే ఉన్న చింతలపాలెంట తహసీల్దార్ కార్యాలయం

- ప్రజాధనం వృథా
- అడుగు ముందుకు పడని ప్రభుత్వ భవన నిర్మాణాలు

చింతలపాలెం, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా చింతలపాలెం మండల కేంద్రంలో ప్రభుత్వ భవనాల పనులు పునాది దశలోనే నిలిచిపోయాయి. మండలాల పునర్విభజనలో భాగంగా చింతలపాలెం కొత్త మండలంగా ఏర్పడింది. ఈ కొత్త మండలానికి వివిధ ప్రభుత్వ కార్యాలయాలు అవసరం కావడంతో అప్పటికప్పుడు తహసీల్దార్, ఎంపీడీవో, పోలీస్, వ్యవసాయ శాఖల భవనాలు అద్దెకు తీసుకొని ఆ భవనాల్లోనే కార్యకలాపాలు నిర్వహిస్తున్నా రు. ఆ గదులు ఇరుకుగా ఉండటంతో కూర్చునేందుకు సిబ్బంది ఇబ్బంది పడుతున్నారు. కార్యాలయాలకు వివిధ పనుల నిమిత్తం వచ్చే వారు ఆరుబటయ ఎండా, వానకు తడుచుకుం టూ నిరీక్షించాల్సిన పరిస్థితి తలెత్తింది. ఈ భవనాకు నెలకు రూ. వేలల్లో అద్దె చెల్లిస్తున్న రికార్డులు భద్రపర్చేందుకు సరైన స్థలం లేదు. కొన్నిచోట్ల మూత్రశాలలు లేక సిబ్బంది అవస్థ లు పడుతున్నారు. అతికష్టం మీద అధికారులు, సిబ్బంది కాలం వెల్లదీస్తున్నారు. దీంతో నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మండ ల అభివృద్ధిని ఎంతో ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నారు. ఇందులో భాగంగా మండలానికి సొంత భవనాలు కేటాయించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ప్రభుత్వ కార్యాలయాలైన తహసీల్దార్ కార్యాలయం రూ.2.60 కోట్లు, ఎంపీడీవో కార్యాలయానికి రూ.2.98కోట్లు, పోలీస్‌స్టేషన్‌కు రూ.2.38 కోట్లు మంజూరుచేసి, శంకుస్థాపన శిలాఫలకం వేసి ఏడాదికాలం పూర్తవుతున్నా పునాది స్థాయిలోనే ఈ భవనాల నిర్మాణ పనులు నిలిచిపోయాయి. ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు. కాంట్రాక్టర్లు టెండ ర్ల ద్వారా కాంట్రాక్టును దక్కించుకున్న నిర్మాణ పనులు చేయడంలో విఫలమయ్యారన్న ఆరోపణలున్నాయి. ఈ ప్రాంతం జిల్లా కేంద్రానికి సుమారు 80 కిలోమీటర్ల దూరం ఉండటంతో ఇటువైపు ఆ శాఖకు సంబంధించిన రోడ్లు, భవనాల శాఖ అధికారులు కన్నెత్తి కూడా చూడడంలేదన్న విమర్శలున్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం ఈ విషయంపై తక్షణమే దృష్టి సారించి నిర్మాణ పనులను వేగవంతం చేయాలని మండల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

గతేడాది నవంబర్‌లో శంకుస్థాపన

చింతలపాలెం మండలంలో ప్రభుత్వ కార్యాలయాలకు మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి గతేడాది నవంబరులో శంకుస్థాపన చేశారు. అధికారుల పర్యవేక్షణ కొరవడడంతో కార్యాలయాల నిర్మాణ పనులు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారింది. దీంతో ఇప్పుడు ఉన్న అద్దె భవనాల్లోకి వెళ్లాలంటే ఇబ్బందులు పడతున్నారు. ఇప్పటికైనా అధికారులు దృష్టి సారించి పనులు వేగంగా అయ్యేలా చూడాలని మండల ప్రజలు కోరుతున్నారు.

పనులు త్వరగా పూర్తి చేయాలి



మండలంలో ప్రభుత్వ కార్యాలయాల భవన నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలి. కాంట్రాక్టర్ల నిర్లక్ష్యంతో పనులు ముందుకు సాగడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి, పనుల్లో జాప్యం లేకుండా, ప్రజాధనం వృథా కాకుండా చూసుకోవాలి.

- ఉసిరికాయల వెంకట్‌గౌడ్, చింతలపాలెం.

కూలీల కొరత..వర్షాలతో వెత



చందంపేట మండలం సంధ్యతండాలో పత్తిచేలో పత్తి తీస్తున్న కూలీలు

గుర్రంపోడు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): పత్తి రైతులను కూలీల కొరత వేధిస్తోంది. పంట చేతికొచ్చే దశలో కూలీలు దొరక్కపోవడంతో రైతులు నానా తంటాలు పడుతున్నారు. ఓ పక్క కురుస్తున్న వర్షాలతో కుదేలవుతుంటే మరోపక్క కూలీలు దొరక్క నానా అవస్థలు ఎదుర్కొంటున్నారు. ప్రతీరోజు రైతులు కూలీల చుట్టూ తిరుగుతున్న వచ్చేందుకు వెనకడుగు వేస్తున్నారు. తరుచూ వర్షాలు కురుస్తుండడంతో పత్తి కిందపడి పంట చేలోనే మొలకెత్తుతోంది. మండలంలో 38 గ్రామపంచాయతీలుండగా, వాటిలో ఎనిమిది ఏఈవోలకు క్లస్టర్లు ఉన్నాయి. మండల పరిధిలోని 41,250 ఎకరాల్లో రైతులు పత్తి సాగు చేశారు. పత్తి చేతికందే సమయంలో వర్షాలురావడంతో పత్తి నల్లబారి కిందపడే అవకాశాలు ఉన్నాయని రైతులు ఆవేదనవ్యక్తం చేస్తున్నారు. కూలీల కొరత ఉండడంతో ఒక్కొక్కరికి రూ.400 చెల్లించినా కూలీలు దొరకడంలేదు. కిలో పత్తితీస్తే రూ.12నుంచి రూ.18 వరకు చెల్లిస్తున్నట్లు రైతులు పేర్కొంటున్నారు. పత్తి కొనుగోలు కేంద్రాలు నేటికీ ప్రారంభించలేదు. సీసీఐ ద్వారా పత్తి కొనుగోలు చేస్తామని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెబుతున్నా నేటికీ కేంద్రాలు తెరుచుకోలేదు. ప్రభుత్వం స్పందించి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని రైతులు కోరుతున్నారు.

చందంపేట మండలంలో..

చందంపేట: అధిక వర్షాలతో పత్తి రైతులు ఇబ్బందులుపడుతున్నారు. గత రోజులుగా కురుస్తున్న ఆగని వర్షాలతో పత్తి రైతులకు ఎదురు దెబ్బ తగిలింది. పత్తిచేలు నీటిలో మునిగి చాలా చోట్ల పత్తి కిందరాలి తడిసి పోయింది. ఇప్పటికే రైతులు ఎకరానికి విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు, వ్యవసాయ కూలీల ఖర్చులతో రూ.18వేల నుంచి రూ. 20వేల వరకు ఖర్చు చేశారు. అధిక పెట్టుబడితో రైతులు కుదేలవుతున్నారు. దానికితోడు పత్తి తీయడానికి కూలీల ఖర్చు రోజుకు రూ.400 నుంచి 500 డిమాండ్ చేస్తున్నారు. అయినా కూలీలు దొరకడంలేదు. కూలీలు తీసే పత్తికి కిలోకు రూ. 16 నుంచి రూ.20 డిమాండ్ చేస్తున్నారు. దీంతో రైతులు తప్పనిసరి పరిస్థితులలో కూలీల డిమాండ్లకు తలొగ్గినా తీసిన పత్తికి తేమశాతం అధికంగా ఉండడంతో మార్కెట్ ధర కూడా రావడంలేదు. దళారులు రూ.6వేల నుంచి రూ.7వేల వరకు పత్తిని కొనుగోలు చేస్తున్నారు. సీసీఐ కేంద్రాల ఏర్పాటు ఆలస్యం కావడంతో రైతులపై మరింత భారంపడింది.

నీరు నిల్వకుండా చూడాలి

వర్షాల కారణంగా పత్తి, పొలాల్లో నీరు నిల్వకుండా రైతులు జాగ్రత్తలు తీసుకోవాలి. బాగా ఎండ ఉన్నప్పుడే పత్తి తీసుకోవాలి. తేమశాతం ఎక్కువగా ఉంటే ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర రాదు.

ఏవో కంచర్ల మాధవరెడ్డి, గుర్రంపోడు

పెట్టుబడులు వచ్చే పరిస్థితిలేదు



నాకున్న రెండు ఎకరాలతో పాటు మరో 10 ఎకరాలు కౌలుకు తీసుకున్నాను. ఒక ఎకరానికి దాదాపు రూ.18వేల నుంచి 20వేల వరకు అయింది. పత్తిదిగుబడి బాగానే ఉన్నప్పటికీ అధిక వర్షాలు, కూలీల కొరతతో పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితిలేదు. తక్షణమే ప్రభుత్వం పత్తి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి కనీసం మద్దతు ధర క్వింటాల్‌కు రూ.8వేలు అందజేయాలి.

- కేతావత్ బిచ్చా, సంధ్యతండా

ప్రభుత్వం ఆదుకోవాలి



ఆరు ఎకరాల్లో పత్తి సాగు చేశాను. దాదాపు రూ.1.60లక్షల వరకు ఖర్చయింది. పత్తిపంట తీసేందుకు కూలీల కొరత తీవ్రంగా ఉంది. పంట చేతికందే సమయంలో వర్షాలు రావడంతో పంట మొలకెత్తి నష్టపోతున్నాం. వర్షాల కారణంగా పత్తి నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి.

- ఐతరాజు కృష్ణయ్య, రైతు, కొప్పోలు

'విజ్ఞాన్' ప్రోగ్రామ్‌లకు ఎన్‌బీఏ టైర్-1 గుర్తింపు



వైస్ చాన్స్‌లర్ కల్నల్ ప్రొఫెసర్ నాగభూషణ్

భూదాన్‌పోచంపల్లి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : దేశవ్యాప్తంగా ఉన్న ఉన్నత విద్యాసంస్థలకు జాతీయ స్థాయిలో నాణ్యత ప్రమాణాలను నిర్ధారించే నేషనల్ బోర్డ్ ఆఫ్ అక్రెడిటేషన్ (ఎన్‌బీఏ) నుంచి విజ్ఞాన్ యూనివర్సిటీలో అర్హత కలిగిన అన్ని ప్రోగ్రామ్స్‌కు టైర్-1 అక్రెడిటేషన్ లభించిందని యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ పీ.నాగభూషణ్ తెలిపారు. ఈ విజయాన్ని పురస్కరించుకుని యూనివర్సిటీలో సోమవారం జరిగిన కార్యక్రమంలో వైస్ ఛాన్సలర్ కల్నల్ ప్రొఫెసర్ పీ నాగభూషణ్ మాట్లాడుతూ విజ్ఞాన్ యూనివర్సిటీ మొదటి నుంచి విద్యా నాణ్యత, పరిశోధనలో ప్రతిభ, సామాజిక బాధ్య త అంశాలను సమన్వయం చేస్తూ ముందుకు సాగుతోందన్నారు. అర్హత కలిగిన అన్ని ప్రోగ్రామ్స్‌కు ఎన్‌బీఏ టైర్-1 అక్రిడిటేషన్ పొందడం ద్వారా విజ్ఞాన్ విద్యా ప్రమాణాలకు, బోధనా నాణ్యతకు జాతీయ స్థాయిలో గుర్తింపు లభించిందన్నారు. న్యూఢిల్లీ కేంద్రంగా పనిచేస్తున్న ఎన్‌బీఏ తనిఖీ బృందం 2025 ఆగస్టు 29 నుంచి మూడు రోజులపాటు విజ్ఞాన్ యూనివర్సిటీని సందర్శించిందని తెలిపారు.

నార్కట్‌పల్లి ఎస్ఐపై చర్యలు తీసుకోవాలి

నల్లగొండటౌన్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): కులం పేరుతో దూషిస్తూ అసభ్యకరమైన మాటలు మాట్లాడిన నార్కట్‌పల్లి ఎస్ఐపై విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని నార్కట్‌పల్లి మండల పరిధిలోని ఔరవాణి గ్రామానికి చెందిన ముప్పిడి మారయ్య పోలీస్ అధికారులను కోరారు. ఈ మేరకు సోమవారం పోలీస్ గ్రీవెన్స్‌డేలో ఎస్పీ శరత్ చంద్రపవార్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. ఇటీవల భూమి సమస్యలతో పోలీస్‌స్టేషన్ సంప్రదించగా ఎస్సీ కులానికి చెందిన నన్ను కులం పేరుతో దూషిస్తూ సీనియర్ సిటిజన్ అని కూడా చూడకుండా ఆత్మగౌరవం దెబ్బతీసే విధంగా మాట్లాడి మానసిక ఒత్తిడికి గురిచేశాడని ఆవేదన వ్యక్తం చేశారు. ఫ్రెండ్లీ పోలీస్ వ్యవస్థకు మచ్చ తెస్తున్న ఎస్ఐపై చర్యలు తీసుకోవాలని నార్కట్‌పల్లి సీఐకి ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోలేదని అందుకే డీఎస్పీకి, జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. వెంటనే పోలీస్ అధికారులు ఎస్సీ, ఎస్టీ యాక్ట్ కింద కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

విద్యార్థులను పరీక్షలకు సిద్ధం చేయాలి



అధ్యాపకులకు సూచనలిస్తున్న ఇంటర్మీడియట్ బోర్డు జాయింట్ సెక్రటరీ భీంసింగ్

నార్కట్‌పల్లి, అక్టోబరు 27, (ఆంధ్రజ్యోతి): విద్యార్థులను 90 రోజుల ప్రణాళిక మేరకు వచ్చే వార్షిక పరీక్షలకు సిద్ధం చేయాలని ఇంటర్మీడియట్ బోర్డు జాయింట్ సెక్రటరీ భీంసింగ్ అన్నారు. నార్కట్‌పల్లిలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీని సోమవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థుల్లో ఉత్తీర్ణత శాతం పెంచేందుకు ఉద్దేశించిన 90 రోజుల పాఠ్య ప్రణాళిక అమలుతీరును ప్రిన్సిపాల్, అధ్యాపకుల ద్వారా పరిశీలించారు. వచ్చే ఏడాదిలో జరిగే జేఈఈ, ఎప్‌సెట్, నీట్ వంటి పోటీ పరీక్షలకు విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలను పెంచాలని సూచించారు. విద్యార్థుల ఎఫ్ఆర్ఎస్ హాజరు శాతాన్ని 28 నుంచి 31 శాతానికి పెంచినట్లు తెలిపారు. కాగా కళాశాలకు కావల్సిన కొన్ని మౌలిక వసతులు, ఇతర సమస్యలను జాయింట్ సెక్రటరీ దృష్టికి తీసుకువెళ్లారు. సమావేశంలో కాలేజీ ప్రిన్సిపాల్ బాలాజీ, అధ్యాపకులు సిబ్బంది ఉన్నారు.

వైభవంగా శ్రీరామ మహాయజ్ఞం

నేరేడుచర్ల, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): నేరేడుచర్లలోని శ్రీకోదండ రామాలయంలో మూడవ రోజు సోమవారం శ్రీరామ యజ్ఞం మహోత్సవాన్ని కన్నుల పండువగా నిర్వహించారు.. ఆలయ పూజారి బృందావనం శ్రీరామ నరసింహతేజ ఆధ్వర్యంలో పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ కొణతం సత్యనారాయరెడ్డి, ఆలయ ధర్మకర్తలు రాచకొండ రామచంద్రరావు, నాగ మాధవరావు, నరేష్, పులిజాల వెంకటరమణారావు, కృపాకర్, వెంకటరెడ్డి, సైదయ్య పాల్గొన్నారు.

బీసీ రిజర్వేషన్ సాధించి తీరుతాం

నేరేడుచర్ల, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల్లో, విద్య, ఉద్యోగ, ఉపాధి రంగాల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ సాధించి తీరుతామని బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధూళిపాళ ధనుంజయనాయుడు అన్నారు. సోమవారం మండల కేంద్రంలో నిర్వహించి విలేకరుల సమావేశంలో సంఘం ముఖ్య నాయకులతో కలిసి ఆయన మాట్లాడారు. బీసీ రిజర్వేషన్లు అమలు కావాలంటే షెడ్యూల్ తొమ్మిదిలో చేర్చాల్సిందేనని అన్నారు. ఎమావేశంలో కొమరాజు వెంకట్,బత్తుల శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

రైతులు అప్రమత్తంగా ఉండాలి

నూతనకల్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): బంగాళఖాతంలో ఏర్పడిన మొంథా తుపానుతో రైతులు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ శ్రీనివాసరావు, ఎంపీడీవో సునీత రైతులను కోరారు. తుపానుతో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సోమవారం మండల కేంద్రంలో వ్యవసాయ శాఖ అధికారులు, ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాలతో నిర్వాహకులతో ఏర్పాటు చేసిన అవగాహన సమావేశంలో వారు మాట్లాడారు. మార్కెట్లకు వచ్చిన ధాన్యం తడవకుండా టార్పాలిన్లు కప్పాలన్నారు. కోతకు వచ్చిన పైరును వర్షాలు తగ్గిన తర్వాత కోయాలని సూచించారు. ఈ సమావేశంలో ఏపీఎం వెంకట్‌రెడ్డి, ఏవో మల్లారెడ్డి, ఐకేపీ నిర్వాహకులు పాల్గొన్నారు.

న్యాయవాది కుటుంబానికి ఆర్థికసాయం

కోదాడ టౌన్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): కోదాడలో ఇటీవల మృతి చెందిన యువ న్యాయవాది యాతాకుల క్రాంతి కుటుంబానికి బార్ కౌన్సిల్ నుంచి వచ్చిన రూ.6.15లక్షలు విలువైన చెక్కును కోదాడ కోర్టులో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సీహెచ్ లక్ష్మీనారాయణరెడ్డి అందజేశారు. ఈ కార్యక్రమంలో దివంగత న్యాయవాది క్రాంతి తల్లిదండ్రులు యాతాకుల విజయ, ఏసోబు, బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు ఉయ్యాల నర్సయ్య, ప్రధాన కార్యదర్శి రామిశెట్టి రామకృష్ణ, సీనియర్ న్యాయవాదులు ఎస్.రాధాకృష్ణమూర్తి, దేవబత్తిని నాగార్జునరావు, నాగేశ్వరరావు, సాధు శరత్‌బాబు, దొడ్డ శ్రీధర్, తమ్మినేని హనుమంతరావు, చల్లా కొండల్‌రెడ్డి, యశ్వంత్, రామారావు, కోదూరు వెంకటేశ్వరరావు, హుస్సేన్, గోవర్ధన్, పాషా, మీరా, పాణి, బండి వీరభద్రరావు పాల్గొన్నారు.

పగలు కోతులు, కుక్కలు.. రాత్రి దోమల విహారం



మఠంపల్లి ఆత్మకూర్(ఎస్) మండలాల్లో పగలు కోతులు, కుక్కల బెడద ఉండగా,, రాత్రిళ్లు దోమల బెడద ఉంది. దీంతో ప్రజలకు కంటి మీద కునుకు కరవుతోంది. మండలంలో కోతులు, కుక్కల సమస్యను పరిష్కరించడంతో పాటు దోమలు వృద్ధి చెందకుండా పారిశుధ్య చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

- (ఆంధ్రజ్యోతి - మఠంపల్లి, ఆత్మకూర్(ఎస్)

» ప్రజలకు కంటి మీద కునుకు కరువు

» లోపించిన పారిశుధ్యం

మఠంపల్లి మండలంలోని పెదవీడు, రఘునాథపాలెం, మఠంపల్లి, మట్టపల్లి, చౌటపల్లి, బక్కమంతులగూడెం, కొత్తతండా, మంచ్యాతండాలలో కోతులు, వీధి కక్కులు ఎక్కువగా ఉన్నాయి.. ఏ వీధిలో చూసినా వీధి కుక్కలు గుంపులు గుంపులుగా తిరుగుతూ ప్రజలను కరుస్తున్నాయి. ఇటీవల రఘునాథపాలెం, పెదవీడు, మఠంపల్లి, తదితర పంచాయతీల్లో కుక్కలు, కోతులు దాడి చేయడంతో పలువురు గాయపడ్డారు. రాత్రి వేళల్లో హాయిగా నిద్రపోదామన్నా దోమల దాటికి కంటి మీద కునుకు కరవైందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దోమల కాటుతో మలేరియా, డెంగీ, చికెన్ గున్యావంటి జ్వరాల బాధితులు పెరుగుతున్నారు.

అధ్వానంగా గ్రామాలు.. మురుగు కాల్వలు

మండలంలోని పలు మేజర్ పంచాయతీల్లో వీధులు అధ్వానంగా ఉన్నాయి. వర్షం పడితే మురుగు నీరు నిల్వ ఉంటోంది.. దీంతో దోమలు పెరుగుతున్నాయి. అదే విధంగా పలు గ్రామాల్లో మురుగు నీరు సాఫీగా వెళ్లడానికి సీసీ కాల్వలు లేవు. దీంతో దోమల సంతతి రోజు రోజుకూ పెరుగుతూ ప్రజలను కుడుతున్నాయి. కాల్వలను శుభ్రం చేయనందున దుర్వాసనతో పలు గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పైపు లైన్ల మార్గంలో, రోడ్లపై మురుగు నీరు నిల్వ లేకుండా, పరిసరాలను పరిశుభ్రంగా ఉండేలా పంచాయతీ అధికారులు ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది.



గ్రామాల్లో ప్రత్యేక వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి ప్రజలకు వైద్యం అందించాల్సిన అవసరం ఉంది.

● ఆత్మకూర్(ఎస్) మండలంలో కూడా కోతులు, కుక్కల బెడద తీవ్రంగా ఉంది. మండలంలోని నెమ్మికల్ దండు మైసమ్మ ఆలయం సమీపంలో సుమారుగా 20కి పైగా ఫంక్షన్ హాల్స్ ఉన్నాయి. శుభకార్యాలు, వివిధ కార్యక్రమాల్లో ఈ ఫంక్షన్ హాల్స్‌లో మిగిలిన ఆహార పదార్థాలను ఎక్కడ పడితే పారవేయడంతో ఆహారం కోసం సమీప గ్రామాల నుంచి కుక్కలు నెమ్మికల్‌కు వస్తున్నాయి. వేడుకలు లేని రోజుల్లో కుక్కలు రోడ్ల పైకి వస్తూ వాహనదారులపై ఎగబడి కరుస్తున్నాయి. ఇటీవల బోట్యాతండాలో రైతులు భూక్యా టీక్యాకు చెందిన గొర్రెల మందపై కుక్కలు దాడి చేయడంతో ఆరు గొర్రెలు మృతి చెందగా, మరో ఐదు గొర్రెలు తీవ్రంగా గాయపడ్డాయి. పశువులపై కుక్కలు దాడి చేయడంతో రేబీస్‌తో పశువులు, గేదెలు మృతి చెందాయి. కుక్కలతో పాటు పలు గ్రామాల్లో కోతుల సంచారం ఎక్కువగా ఉంది. గత ఏడాది పాత సూర్యాపేటలో ఇంట్లో ఒంటరిగా ఉన్న మెట్టు లింగమ్మ అనే వృద్ధురాలిపై దాడి చేయడంతో ఆమె చనిపోయింది.

పారిశుధ్యంపై దృష్టి సారించాలి



మఠంపల్లి మండలంలో పలు పంచాయతీల్లో మురుగు నీరు, పారిశుధ్యంపై అధికారులు దృష్టి సారించాలి. దోమలు ప్రబలకుండా మందులను పిచికారీ చేయాలి. పైపులైన్లు, రోడ్ల పై మురుగు నీరు నిల్వ లేకుండా, పరిసరాలను పరిశుభ్రంగా ఉండేలా పంచాయతీ అధికారులు ప్రజలకు అవగాహన కల్పించాలి.

- బానోతు నాగేశ్వరావునాయక్

కుక్కలు, కోతుల బెడద నుంచి విముక్తి కలిగించాలి



పగలు కుక్కలు, కోతులు, రాత్రి దోమలు బెడదతో ఇబ్బందులు పడుతున్నాం. ఏ వీధిలో చూసినా వీధి కుక్కలు గుంపులు గుంపులుగా తిరుగుతూ కరుస్తున్నాయి. ఇళ్ల నుంచి బయటికి రావాలంటే బయపడుతున్నాం. పాలకులు, అధికారులు సమన్వయంతో పని చేసి వీటి బెడద నుంచి విముక్తి కల్పించాలి.

- మీసాల మధుబాబు, మఠంపల్లి

నివారణకు చర్యలు తీసుకుంటాం

మఠంపల్లి మండలంలోని దోమల నియంత్రణకు, కోతులు, వీధి కుక్కలను కట్టడి చేయడానికి చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శులకు ఆదేశాలు ఇచ్చాం. డ్రైనేజీల్లో మురుగు నీరు సాఫీగా వెళ్లేగా స్పెషల్ డ్రైవ్ చేస్తాం. దోమల నివారణకు గ్రామాల్లో రాత్రి వేళల్లో ఫాగింగ్ చేయాలని, పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని, నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని గ్రామ కార్యదర్శులకు హెచ్చరికలు జారీ చేశాం.

- వెంకటాచారి, ఎంపీడీవో, మఠంపల్లి

రైతులను ఆదుకోవాలి

హుజూర్‌నగర్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): వర్షాలతో నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కంబాల శ్రీనివాసు, గుండు వెంకటేశ్వర్లు కోరారు. సోమవారం పట్టణంలోని వ్యవసాయ శాఖ ఏడీఏ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి ఏడీఏ రవీందర్‌కు వినతిపత్రం అందజేసి మాట్లాడారు. రైతులకు ఎకరానికి రూ.20వేల చొప్పున పరిహారం చెల్లించాలన్నారు. . ఈ కార్యక్రమంలో జక్కుల రమేష్, వెంకయ్య, కృష్ణ, నర్సయ్య, సత్యనారాయణ, శ్రీనివాసు పాల్గొన్నారు.

హామీలను నెరవేర్చని ప్రభుత్వం

తుంగతుర్తి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలుచేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం కాలయాపన చేస్తోందని బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు తాటికొండ సీతయ్య అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని సంతలో కాంగ్రెస్ బాకీ కార్డులను పంపిణీ చేసి మాట్లాడారు. రాబోయే స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలు తగిన బుద్ధి చెప్పాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు గోపగాని రమేష్, తునికి సాయిలు పాల్గొన్నారు.

● ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో కాంటాలు ప్రారంభించాలని బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు తాటికొండ సీతయ్య అన్నారు. సోమవారం మండలంలోని బండరామారంలో ఐకేపీ కేంద్రం ఎదుట నిరసన వ్యక్తం చేసి మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండేళ్ల నుంచి రైతులు అన్నివిధాలా నష్టపోతున్నారని అన్నారు. . ఈ కార్యక్రమంలో ఆకారపు భాస్కర్, కొల్లూరి మహేందర్, జటంగి బక్కయ్య రేగటి రాములు, గడ్డం సూరయ్య పాల్గొన్నారు.

కోళ్ల ఫాం అనుమతులు రద్దు చేయాలి

ఆత్మకూర్(ఎస్), అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఇస్తాళాపురం గ్రామ సమీపంలో కోళ్ల ఫాం అనుమతులను రద్దు చేయాలని ఆ గ్రామస్థులు డిమాండ్ చేశారు. సోమవారం పలువురు రైతులు మాట్లాడుతూ బాలెంల గ్రామానికి చెందిన పులగం వెంకటరెడ్డికి రైస్ మిల్లు ఏర్పాటు చేసుకోవడానికి అనుమతి ఇస్తున్నామని గ్రామ కార్యదర్శి ప్రకటించి, కోళ్ల ఫాంకు అక్రమంగా అనుమతి ఇచ్చారన్నారు. . కోళ్ల ఫాంతో ప్రజలు అనారోగ్యం బారిన పడతారని, పక్కను ఉన్న గ్రామ పంచాయతీ బోర్ నీరు కలుషితమవుతాయని, వెంటనే అనుమతులు రద్దు చేయాలంటూ కార్యదర్శికి గామస్థులు లింగారెడ్డి, శంకర్, మధు, శ్రీనివాస్, రాములు తదితరులు ఫిర్యాదు చేశారు.

భక్తిశ్రద్ధలతో కార్తీక సోమవారం పూజలు



ఉండ్రుగొండలో శివలింగానికి అభిషేకం చేస్తున్న భక్తులు

సూర్యాపేటటౌన్, చివ్వెంల, చింతలపాలెం, పెన్‌పహాడ్, ఆత్మకూర్(ఎస్), కోదాడ టౌన్, హుజూర్‌నగర్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): కార్తీక మాస సోమవారం పురస్కరించుకొని జిల్లాలోని ఎలు దేవాలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని శ్రీఅన్నపూర్ణ సహిత విశ్వనాథస్వామి దేవాలయం, శ్రీరామలింగేశ్వర స్వామి దేవాలయం, సంతోషిమాత దేవాలయంలో పూజలు నిర్వహించారు.

● చివ్వెంలమండలంలోని ఉండ్రుగొండ గిరిదుర్గం శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయ ప్రాంగణంలోని శ్రీ ఉమామహేశ్వరస్వామికి మహన్యాసపూర్వక రుద్రాభిషేకం వైభవంగా శాస్త్రోక్తంగా జరిపించారు. కార్తీకమాసం పూర్తయ్యేవరకు ప్రతిరోజు ఉదయం ఏడు గంటల నుంచి 10 గంటల వరకు అభిషేకాలు ఉంటాయని ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు, ఆలయ పూజారి ఆనందశర్మ తెలిపారు.

● చింతలపాలెం మండలంలోని ఉమామహేశ్వరస్వామి దేవాలయంలో, దొండపాడు శివాలయంలో భక్తులు స్వామిని దర్శించుకుని భక్తులు పరవశించి పోయారు. ఈ కార్యక్రమంలో ఉమామహేశ్వరస్వామి దేవాలయ చైర్మన్ అంబటి రామకృష్ణారెడ్డి, అయ్యప్ప మాలధారులు, మహిళా భక్తులు పాల్గొన్నారు.


● పెన్‌పహాడ్ మండలంలోని నాగులపహాడ్ త్రికుటేశ్వరాలయం, పెన్‌పహాడ్ శంభు లింగేశ్వర ఆలయాల్లో భక్తుల రద్దీ నెలకొంది. శ్రీఆంజనేయస్వామి దేవాలయం, రామాలయాల్లో కూడా ప్రత్యేక పూజలు నిర్వహించారు

●ఆత్మకూర్(ఎస్) మండలంలోని నెమ్మికల్ లోని పురాతన శివాలయంలో భక్తులు పూజలు నిర్వహించారు. ముందుగా దేవాలయాన్ని శుద్ధి చేశారు. శివ మాలధారులు అభిషేకాలు, భజనలు చేశారు.

● కోదాడ పట్టణం హుజూర్‌నగర్ రోడ్డులోని అయ్యప్పస్వామి దేవాలయంలో నిర్వహించిన కార్తీక సోమవారం పూజల్లో మాజీ సర్పంచ్ ఎర్నేని వెంకటరత్నంబాబు పాల్గొన్నారు. ఆయన వెంట అయ్యప్ప స్వామి భక్తులు, రావెళ్ల కృష్ణారావు ఉన్నారు.

● హుజూర్‌నగర్ మండలంలోని బూరుగడ్డ శివాలయంలో ఉదయం ఆరు గంటల సమయంలో శివలింగంపై సూర్యకిరణాలు ప్రసరించగా, స్వామి దర్శనానికి భక్తులు బారులు తీరారు.s పలు పూజా కార్యక్రమాల్లో ఈవో గుజ్జుల కొండారెడ్డి, గజ్జి ప్రభాకర్, అర్చకులు శ్రీనివాసశర్మ, రవీంద్రాచార్యులు, సుబ్రహ్మణ్యాచార్యులు, ఓరుగంటి నాగేశ్వరరావు, సూర్యప్రకాశ్‌రావు, కీతా మల్లికార్జున్‌రావు, అరవిందరెడ్డి పాల్గొన్నారు.

గీతన్న బంధు ప్రకటించాలి



తుంగతుర్తిలో మాట్లాడుతున్న ఎలుగూరి గోవింద్

తుంగతుర్తి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): గీతన్న బంధును ప్రభుత్వం ప్రకటించి కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలని కల్లు గీత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ఎలుగూరి గోవిందు కోరారు. సంఘం మండల అధ్యక్షుడు మద్దెల నర్సయ్య ఆధ్వర్యంలో సోమవారం తుంగతుర్తి నియోజకవర్గ కేంద్రంలోని శ్రీవేంకటేశ్వర ఫంక్షన్ హాల్‌లో జిల్లా 4వ మహాసభలను ప్రారంభించి మాట్లాడారు. కల్లు గీత వృత్తికి అండగా నిలిచిన (కంఠ మహేశ్వరుడు) స్ఫూర్తితో కల్లుగీత కార్మికుల హక్కుల సాధన కోసం పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మడ్డి అంజిబాబు, తణుకు సైదులు గౌడ్, ఆకుల రమేష్, చిర్ర నరేష్, తునికి సాయిలు, బుర్ర శ్రీనివాస్, గుండగాని అంజయ్య, పాల్గొన్నారు.

అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులు సక్రమంగా చేపట్టాలి

సూర్యాపేటటౌన్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు సక్రమంగాచేపట్టాలని మునిసిపల్ కమిషనర్ సీహెచ్ హన్మంతరెడ్డి అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని మునిసిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. పట్టణంలో ఇప్పటివరకు తవ్విన ప్రాంతాల్లో గ్రావెల్ డస్ట్ పోసి సమానంగా చేయాలన్నారు. మంచినీటి పైపులు ధ్వంసం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.కార్యక్రమంలో మునిసిపల్ ఈఈ ఎం.కిరణ్, డీఈలు సత్యారావు, రమాదేవి, ఏఈలు అనిల్, తిరుమలయ్య, ప్రసాద్ పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి



జాజిరెడ్డిగూడెంలోని మాక్స్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న కాంగ్రెస్ నాయకుడు గుడిపెల్లి మధుకర్

అర్వపల్లి, ఆత్మకూర్(ఎస్), మద్దిరాల, తిరుమలగిరి, తుంగతుర్తి, నాగారం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కాంగ్రెస్ నాయకుడు గుడిపెల్లి మధుకర్‌రెడ్డి అన్నారు. సోమవారం జాజిరెడ్డిగూడెం గ్రామంలో మాక్స్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆడిటర్ బడేసాబ్‌తో కలిసి ఆయన ప్రారంభించి మాట్లాడారు.ఈ కార్యక్రమంలో నాయకులు దాసరి సోమయ్య, రింగు సత్యం, మామిడి వీరయ్య, మామిడి రాజ్‌కుమార్, రింగు నరహరి, బొల్లం యాదయ్య, కోటమర్తి వెంకన్న పాల్గొన్నారు.

● ధాన్యం కొనుగోలు కేంద్రాలల్లో మౌలిక వసతులు కల్పించాలని తహసీల్దార్ శ్రీకాంత్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని తిమ్మాపురం, రామన్నగూడెం గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలను పరిశీలించి ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ఆర్ఐ వెంకట్‌రెడ్డి, రెవెన్యూ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

● ఆత్మకూర్(ఎస్) మండలంలోని పాతర్లపహాడ్‌లో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తహసీల్దార్ అమీన్‌సింగ్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి దివ్య, ఏపీఎం మందడి రాము, సీసీ ఇద్దయ్య, సంఘ బంధం సభ్యులు, నిర్వాహకులు పాల్గొన్నారు.

● రైతులు ధాన్యాన్ని ఆరబెట్టుకొని కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని తహసీల్దార్ అయేషాపర్వీనా అన్నారు. సోమవారం మద్దిరాల మండలం గోరెంట్ల, ముకుందాపురం గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి ఆమె మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఏవో అనిషా రోహి, ఏపీఎం శ్రీనివాస్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముక్కాల అవిలమల్లుయాదవ్, నాయకులు తాళ్లపల్లి సురేష్, అంగిరేకుల రాంమూర్తి, సంగని సాగర్, శ్రీను, కొమరయ్య పాల్గొన్నారు.

● తిరుమలగిరిలోని శ్రీనివాస, సంతోషిమాత, సిద్దికి జిన్నింగ్ మిల్లుల వద్ద పత్తి కొనుగోలు కేంద్రాలను తిరుమలగిరి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ ఎల్సోజు చామంతి నరేష్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ పాలెపు చంద్రశేఖర్, మార్కెట్ కార్యదర్శి సురేష్, డైరెక్టర్లు హఫీజ్, రాపాక సోమేష్, అంగోతు రాములు, ఉప్పలయ్య, వేణుగోపాలరావు తదితరులు పాల్గొన్నారు.

● తుంగతుర్తి మండలంలోని గొట్టిపర్తి గానుగబండ, తూర్పుగూడెం, తుంగతుర్తి, అన్నారం, గుడితండాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను తహసీల్దార్ దయానందంతో కలిసి త్రుంగతుర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ చింతకుంట్ల వెంకన్న ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం అశోక్, రామయ్య, రమేష్, నర్సింగ్‌నాయక్, జమున, కాంగ్రెస్ పార్టీ నాయకులు రామ్‌సింగ్ పాల్గొన్నారు.

● నాగారం మండలంలోని ఈటూరు గ్రామంలో సిద్ధి ఫైబర్, శ్రీనివాస జిన్నింగ్ మిల్లులో సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాలను, వర్ధమానుకోట, నాగారం, శాంతినగర్ గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో పత్తి కొనుగోలు కేంద్రాలను తిరుమలగిరి మార్కెట్ కమిటీ చైర్మన్ ఎల్సోజు చామంతి నరేష్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ పాలెపు చంద్రశేఖర్, ఆకుల బుచ్చిబాబు తొడుసు లింగయ్య, సురేష్, తహసీల్దారు హరికిషోర్‌శర్మ, ఏవో కృష్ణకాంత్ తదితరులు పాల్గొన్నారు.

మద్యం దుకాణాల కేటాయింపు పూర్తి

(5వ పేజీ తరువాయి)

కేటాయింపులో కొందరికి లక్కు వరించగా మరికొందరికి నిరాశ మిగిలింది. జిల్లాలో మొత్తం 93 దుకాణాలకు 2,771 దరఖాస్తులు వచ్చాయి. అందులో 93 మందికి లక్కు వరించింది. మిగిలిన వారు నిరాశతో వెనుతిరిగారు. సాధారణంగా ఒకరి పేరున, కుటుంబంలో ఒకరికి లక్కీ డ్రాలో దుకాణం రావడం గొప్ప విషయం. అలాంటిది ఏకంగా భార్యభర్తలు ఇద్దరికి లక్కీ డ్రాలో రెండు దుకాణాలు రావడంతో వారి ఆనందానికి అవధులు లేకుండా పోయింది. సూర్యాపేటలోని అంజనాపురికాలనీకి చెందిన ఎలికట్టి భరత్-శ్రావణి దంపతులకు లక్కీడ్రాలో సూర్యాపేట పట్టణంలోని రెండు దుకాణాలు డ్రాలో దక్కాయి. డ్రాలో సూర్యాపేటలోని 21వ నెంబరు దుకాణం భరత్‌కు, 13వ నెంబరు దుకాణం భార్య శ్రావణికి దక్కింది. భార్యాభర్తలకు లక్కీ డ్రాలో దుకాణాలు రావడంతో వారికి అధికారులు, మద్యం వ్యాపారులు, కుటుంబ సభ్యులు, స్నేహితులు అభినందనలు తెలిపారు.

పలు దుకాణాలకు బేరసారాలు

జిల్లాలో మద్యం దుకాణాల కేటాయింపు పూర్తి కాగానే కొంత మంది మద్యం వ్యాపారులు జిల్లాలోని పలు దుకాణాలకు బేరసారాలు నిర్వహించారు. దుకాణాలు వచ్చిన వారితో లక్షల్లో గుడ్‌విల్ ఇచ్చేందుకు చర్చలు జరిపారు. దుకాణాన్ని బట్టి రూ.70లక్షల నుంచి రూ.కోటి వరకు ఇచ్చేందుకు చర్చలు కొనసాగించారు. రెండు, మూడు రోజులు గడిస్తేగానీ ఈ బేరసారాల విషయాలు తెలియనున్నాయి.

పరిసర గ్రామాలను అభివృద్ధి చేస్తాం

మఠంపల్లి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మైహోం పరిశ్రమ పరిధిలోని గ్రామాల అభివృద్ధికి తమవంతు సహాయ సహకారాలు అందజేస్తామని పరిశ్రమ యూనిట్ హెడ్ ఎస్.శ్రీనివాసరావు అన్నారు. సోమవారం మఠంపల్లి శుభవార్త దేవాలయ ప్రాంగణంలో కమ్యూనిటీ హాల్‌కు అనుబంధంగా డైనింగ్ హాల్ ఏర్పాటుకు మైహోం సిమెంట్స్ పరిశ్రమ సామాజిక కార్యక్రమంలో భాగంగా రూ.15లక్షల విలువైన చెక్కును దేవాలయ కమిటీకి అందజేసి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఆధూరి కిషోర్‌రెడ్డి, రాజారెడ్డి, చిన్నపరెడ్డి, శ్రీరామ్, ఏజీఎం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఓటర్లను మ్యాపింగ్ చేయాలి

నూతనకల్: మండలంల్నో 2002 ఓటరు జాబితాను సరిపోల్చుతూ ప్రస్తుతం ఓటర్లుగా నమోదవుతున్న వారి పేర్లను బీఎల్‌వో యాప్‌లో నమోదు చేయాలని తహసీల్దార్ శ్రీనివాసరావు కోరారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో బీఎల్వోలు, సూపర్‌వైజర్లకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.

అంగన్‌వాడీ కేంద్రంలో ప్లేట్లు పంపిణీ

నూతనకల్: మండలంలోని అలుగునూరు గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలోని చిన్నారులకు సోమవారం దోసపాడు గ్రామానికి చెందిన మాదగోని సమత ప్లేట్లు, గ్లాసులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ పొడేటి శ్రీలత పాల్గొన్నారు.

చలో కలెక్టరేట్‌ను విజయవంతం చేయాలి

సూర్యాపేటఅర్బన్: రాష్ట్రంలో వరి, పత్తి, మొక్కజొన్న పంటలు కొనుగోలు చేయాలని కోరతూతి ఈ నెల 31వ తేదీన నిర్వహించే చలో కలెక్టరేట్‌ను విజయవంతం చేయాలని ఏఐకేఎంఎస్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు వి.కోటేశ్వరరావు కోరారు. సోమవారం జిల్లా కేంద్రంలోని చంద్రపుల్లారెడ్డి విజ్ఞాన కేంద్రంలో అఖిలభారత రైతుకూలి సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలోమందారి డేవిడ్ కుమార్, పోటు లక్ష్మయ్య, బొడ్డు శంకర్, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

ఫ్లెక్సీ చింపిన వారిపై చర్యలు తీసుకోవాలి

సూర్యాపేట క్రైం: సూర్యాపేటలోని బీజేపీ కార్యాలయం వద్ద ఈ నెల 26వ తేదీన ఏర్పాటు చేసిన ఫ్లెక్సీని చింపిన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని బీజేపీ నల్లగొండ పార్లమెంట్ నియోజకవర్గ కో-కన్వీనర్ తుక్కాని మన్మథరెడ్డి కోరారు. సోమవారం పార్టీ ఆధ్వర్యంలో సూర్యాపేట డీఎస్పీ కార్యాలయంలో డీఎస్పీ ప్రసన్నకుమార్‌తో పాటు పట్టణ ఇన్‌స్పెక్టర్ వెంకటయ్యకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు చేసిన వారిలో బండపల్లి పాండురంగాచారి, దోసకాయల ఫణినాయుడు, దాసరి వెంకన్నయాదవ్, రవినాయక్, పరశురాం ఉన్నారు.

దామోదర్‌రెడ్డి ఆశయాలు సాధించాలి

మోతె: ప్రజా సమస్యలపై తుది వరకు పోరాడిన యూసీసీఆర్ఐ ఎంఎల్ రాష్ట్ర నాయకుడు సరసాని దామోదర్‌రెడ్డి ఆశయాలు సాధించాలని ఆ సంఘం జిల్లా నాయకుడు సరసాని సుధాకర్‌రెడ్డి అన్నారు. దామోదర్‌రెడ్డి వర్ధంతి సందర్భంగా సోమవారం మండలంలోని నామవరంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పాలకూరి యల్లయ్య, మల్సూర్, నర్సయ్య, ఉపేందర్‌రెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, మధు పాల్గొన్నారు.

కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌ను పూర్తి చేయాలి

పెన్‌పహాడ్: కామారెడ్డి బీసీ డిక్లరేషన్ ను పూర్తి చేసి, స్థానిక సంస్థల ఎన్నికలలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించాలని బీసీ కులాల సమన్వయ వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండు లక్ష్మీనారాయణ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. బీసీలను కేవలం ఓటు బ్యాంకు రాజకీయాలకు వాడుకోవడం సరికాదన్నారు

వంతెన పనులు త్వరగా పూర్తి చేయాలి

మునగాల రూరల్: మండలంలోని నేలమర్రి, మాధవరం గ్రామాల మధ్యలో వంతెన నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు బచ్చలకూర స్వరాజ్యం డిమాండ్ చేశారు. సోమవారం మునగాల ఆయన మాట్లాడుతూ వంతెన పక్కన తాత్కాలింగా ఏర్పాటు అప్రోచ్ రోడ్డు సరిగా లేక వాహనదాలు దిగబడుతున్నాయన్నారు. ప్రభుత్వం స్పందించాలన్నారు.

కార్డులను సద్వినియోగం చేసుకోవాలి

గరిడేపల్లి: ఎరువుల సరఫరా కార్డులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని రాయినిగూడెం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ జుట్టుకొండ సత్యనారాయణ అన్నారు. సోమవారం మండలంలోని కీతవారిగూడెంలోని సంఘ కార్యాలయంలో రైతులకు కార్డులను ఆయన పంపిణీ చేసి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు అంజయ్య, నాగేశ్వరరావు, కార్యదర్శి నిడిగొండ కనకయ్య, సిబ్బంది లక్ష్మయ్య, అంజయ్య, శ్రీను, సాయిలు పాల్గొన్నారు.

ప్రజాసమస్యల పరిష్కారానికి పోరాటం

తిరుమలగిరి: ప్రజా సమస్యల పరిష్కారానికి సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ పోరాటం చేస్తోందని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గోగినపల్లి వెంకటేశ్వరావు అన్నారు. సోమవారం తిరుమలగిరి మునిసిపల్ కేంద్రంలో వివిధ పార్టీలకు చెందిన సుమారు 100 మంది ఆ పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో మాస్ లైన్ జిల్లా కార్యదర్శి కొత్తపల్లి శివకుమార్, పీవోడబ్ల్యూ రాష్ట్ర కార్యదర్శి స్వరూప, శిరోమణి, జిల్లా కార్యదర్శి కొత్తపల్లి రేణుక, కారింగుల వెంకన్న పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

గరిడేపల్లి: పంచాయతీ కార్మికుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సీపీఎం మండల కార్యదర్శి షేక్ యాకుబ్ కోరారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో ఆర్.సరోజకు వినతిపత్రం అందజేసి మాట్లాడారు. మండలంలోని 14 గ్రామ పంచాయతీలకు చెందిన కార్మికులకు మూడు నెలలు వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో కొండ సైదులు, అమరారపు రమేష్, నాగాచారి, మధు, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

జీవిత బీమా ప్రతి కుటుంబానికి భద్రత

ఆత్మకూర్ (ఎస్), అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : జీవిత బీమా ప్రతి కుటుంబానికి భద్రత కల్పిస్తుందని ఎస్‌బీఐ సూర్యాపేట ప్రాంతీయ మేనేజర్ బి.అనిల్‌కుమార్ అన్నారు. ఇటీవల ఆత్మకూర్(ఎస్) మండల కేంద్రానికి చెందిన గుణగంటి మధు బైక్ ప్రమాదంలో చనిపోవడంతో సోమవారం మృతుడి భార్య స్వప్న కు ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్స్ నుంచి రూ.20లక్షల చెక్‌ను అందజేసి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో విద్యాసాగర్, బి.సుమన్, విక్రం, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

కార్మికుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వాలు విఫలం

మఠంపల్లి: కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో పాలక ప్రభుత్వాలు విఫలమయ్యాయని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు శీలం శ్రీను అన్నారు. సోమవారం మఠంపల్లి సీపీఎం కార్యాలయంలో జరిగిన సీఐటీయూ మండల మహాసభలో ఆయన మాట్లాడారు. అనంతరం మండల నూతన కమిటీని ప్రకటించారు. ఐటీయూ మఠంపల్లి మండల కన్వీనర్‌గా మండలంలోని భీమ్లాతండాకు చెందిన పానుగోతు శంభయ్యనాయక్‌ను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎ.కోటేశ్వరి, శాగంరెడ్డి జగన్‌మోహన్‌రెడ్డి, పాండునాయక్ పాల్గొన్నారు.

రైతులకు యాసంగి బోనస్ డబ్బులు ఇవ్వాలి

కోదాడ రూరల్: రైతులకు యాసంగి బోనస్ డబ్బులు ఇవ్వాలని రామలక్ష్మీపురం బీఆర్ఎస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు అన్నెం అంజిరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతులకు క్వింటాకు రూ. 500 బోనస్ ఇస్తామని చెప్పి యాసంగి ధాన్యం వరకు ఇవ్వలేదదన్నారు. అదేవిధంగా ఇటీవల కురిసిన అకాల వర్షాలకు పంట దిగుబడి కూడా తగ్గిందని, అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రైతులకు నష్టపరిహారం అందించాలని కోరారు.

ఓటమి భయంతోనే ఆరోపణలు

నూతనకల్: జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో ఓటమి తప్పదనే భయంతోనే బీఆర్ఎస్ నాయకులు సీఎం, మంత్రులపై అనవసర ఆరోపణలు చేస్తున్నారని యువజన కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పసుల అశోక్‌యాదవ్ అన్నారు. సోమవారం మండంలోని మాచనపల్లి గ్రామంలో విలేకరులతో మాట్లాడారు. ఒక సంవత్సరంలో 59వేల ఉద్యోగాలు ఇచ్చిన ఘనత కాంగ్రెస్ పార్టీ, సీఎం రేవంత్‌రెడ్డికే దక్కిందన్నారు. ఈ సమావేశంలో బొల్క సైదులు, నిమ్మనగోటి వెంకటేష్, నిమ్మనగోటి శ్రీను, వీరబోయిన వెంకన్న, గణేష్, ఎలేందర్, సురేష్ తదితరులు ఉన్నారు.

రిటైర్డు ఉద్యోగుల సామూహిక పుట్టిన రోజు వేడుకలు

నేరేడుచర్ల: ఈ నెలలో పుట్టిన రిటైర్డు ఉద్యోగుల సామూహిక పుట్టిన రోజు వేడుకలను సోమవారం పట్టణంలోని రిటైర్డు ఉద్యోగుల భవనంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు చింతకుంట్ల పూర్ణచంద్రారెడ్డి ఆధ్వర్యంలో నూకల కమలమ్మ, ప్రతికంఠం సీతారావమ్మలతో కేక్ కట్ చేయించి శాలువతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో సంఘం సభ్యులు సత్యనారాయణ, బుద్ధారెడ్డి, వీరభద్రరావు, రంగారెడ్డి, థేరిస్సా లక్ష్మీకాంతమ్మ, రామస్వామి, సుందరయ్య, శ్రీరామ్‌రెడ్డి పాల్గొన్నారు.